ఈనాడు చిత్తూరు

శుక్రవారం 11 ఆగస్టు 2017 | 16 పేజీలు

పైరు వాడే వేళ.. ఏరు పారే నేల



ఐరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద గార్గేయనది పొంగడంతో స్తంభించిన వాహనాల రాకపోకలు

10లో

వాన మడుగులు.. దీక్ష అడుగులు



తిరుపతి తారకరామ మైదానంలో వర్ష పునీటిలో కవాతు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

3లో

అరకొర జమ.. పరిహారం మమ!



- అందని పంట నష్ట పరిహారం
- కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ
- సమాధానం చెప్పేవారు కరవు
- జమకాని గతేడాది పరిహారం



ఈ చిత్రంలోని రైతు పేరు రమేష్‌కుమార్‌రెడ్డి. వాల్మీకిపురం మండలం చిన్నగంగువారిపల్లి గ్రామం. పంట నష్ట పరిహారం కింద రూ.12వేలు మంజూరైనట్లు వ్యవసాయాధికారులు పత్రాన్ని అందజేశారు. అయినా బ్యాంకులో నగదు జమ కాలేదు. పరిహారం కోసం వ్యవసాయ కార్యాలయానికి వెళితే తమకు సంబంధం లేదు.. జాబితాను పంపించేశాం.. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లమని చెబుతున్నారు. గట్టిగా అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. వీరిద్దరే కాదు.. వేలాదిమంది అన్నదాతలు పరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా.. అధికారులు కరుణ చూపడం లేదు.

చిత్తూరు, న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది జిల్లాలో అన్నదాతల పరిస్థితి.. ఆరుగాలం శ్రమించినా కరవు ధాటికి నష్టపోయిన కర్షకులను ఆదుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఏడాది లోపే పరిహారాన్ని మంజూరు చేసింది.. సత్వరమే పరిహారం నగదును అందచేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది.. పరిహారం మంజూరైందన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు.. అధికారుల తప్పిదం, అలసత్వం అన్నదాతల పాలిట శాపంగా మారింది. పరిహారం మంజూరై రెండు నెలలు కావస్తున్నా

... వివరాలు 7లో

- ❖ వేరుసెనగ నష్ట పరిహారం విడుదల : రూ.163కోట్లు
- ❖ లబ్ధిదారుల(రైతుల) సంఖ్య : 2,14,985మంది
- ❖ మొదటివిడత ఖజానాశాఖకు సమర్పించిన బిల్లు : రూ.157.8కోట్లు
- ❖ బ్యాంకు, ఆధార్ నంబర్ల తప్పులతో ఖాతాలకు జమకాని పరిహారం : రూ.5.1కోట్లు
- ❖ ఇంకా ఖజానాశాఖకే సమర్పించని బిల్లుల మొత్తం : రూ.5.2కోట్లు
- ❖ పరిహారం అందని రైతులు : 13,650 మంది

ఎస్‌ఆర్‌పురంలో నకిలీ పాసుపుస్తకాలు

ప్రాథమిక విచారణలో తేల్చిన అధికారులు

చిత్తూరు: జిల్లాలోని శ్రీరంగరాజపురం మండలంలో నకిలీ పట్టాదారు పాసుపుస్తకాల తయారీ వాస్తవమని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇక్కడ నకిలీ పట్టాదారు పుస్తకాలు తయారుచేసి బ్యాంకుల్లో రూ.లక్షల్లో రుణాలు పొందారు. ఈ అంశంపై గత నెల 24వ తేదీన 'ఈనాడు' జిల్లా సంచికలో 'లేని భూమికి రుణం.. నకి'లీల' రణం' శీర్షికన

... మిగతా 7లో

శకటమా... ప్రగతి రథమా.. 8,9లో

కరవు రైతుకు మినీ సాయం 11లో

పంచాయతీ లెక్క.. ఇక పక్కా! 16లో

కౌన్సెలింగ్ కష్టాలు షురూ!

- సాంకేతిక సమస్యలు
- ఖాళీల ప్రదర్శనలోనూ ఆరోపణలు
- ఉపాధ్యాయుల పడిగాపులు
- కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ


అర్ధరాత్రి వరకు పడిగాపులు

చిత్తూరు

వారం రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ ఎన్నో అవాంతరాలు, ఆరోపణల నడుమ ప్రహసనంగా కొనసాగుతోంది. ఏ రోజు ఎవరికి, ఎప్పుడు కౌన్సెలింగ్ జరుగుతోందో తెలియని గందరగోళం నడుమ ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. జిల్లాలో బదిలీల కోసం 10,264 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల రోజులుగా సవరణలు, దరఖాస్తుల సమర్పణ పేరుతో ఉపాధ్యాయులతో పాటు అధికారులు సైతం తమ సమయాన్ని వెచ్చిస్తున్నారు. సీనియారిటీ జాబితాలు తప్పుల తడకగా ఉండడంతో చాలమంది ఉపాధ్యాయులు సవరణల కోసం ఎంఈవో, డీవైఈవో, డీఈవో కార్యాలయాల చుట్టూ తిరిగారు. అభ్యంతరాల్ని స్వీకరించిన అధికారులు సవరణ జాబితాలను విడుదల చేసినా ఇప్పటికీ కొన్ని సవరణలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు స్కూల్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ పూర్తయ్యింది. ఇందులోనూ లేని ఖాళీలను ప్రదర్శించడంతో వాటిని కోరుకున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే పంచాయతీలోని ఖాళీలను ప్రదర్శించడంలోనూ నిబంధనలు అమలుకావడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సంబధిత బాధితులు తమకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

సమస్యలతో ఉక్కిరి బిక్కిరి

రెండ్రోజుల నుంచి జరుగుతున్న సెకండరీ గ్రేడు టీచర్ల బదిలీలు జాతరను తలపిస్తున్నాయి. ఉదయం 8గంటల నుంచే కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని అధికారులు ప్రకటించినా పరిస్థితులు భిన్నంగా కన్పిస్తున్నాయి. ఓ వైపు వెబ్ సైట్ సక్రమంగా ఓపెన్ కాకపోవడంతో కౌన్సెలింగ్ ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మధ్య మధ్యలో సాంకేతిక సమస్యలతో సర్వర్ మొరాయిస్తుండడంతో గంటల తరబడి ప్రక్రియ నిలిచిపోతోంది. మరో వైపు విద్యుత్తు అంతరాయం కూడా జాప్యానికి కారణమవుతోంది. సాయంత్రం 6గంటలకు ముగియాల్సిన కౌన్సెలింగ్ మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు జరుగుతున్న పరిస్థితి సమస్య తీవ్రతను తెలుపుతోంది. రోజుకు వెయ్యి మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలవడం, నిర్దేశిత సమయానికి ప్రారంభం కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అధికారులు కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించినప్పటికీ భోజన సౌకర్యాలు, తగినన్ని మరుగుదొడ్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఖాళీల ప్రదర్శనలోనూ సమస్యలు

ఖాళీల ప్రదర్శనలోనూ ఇబ్బందులు ఎదరవుతున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉదయం జాబితాలో ప్రదర్శించిన కొన్ని ఖాళీలు కౌన్సెలింగ్ సమయంలో తెరపై కన్పించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇది వరకే కోరుకున్న ఖాళీలు సైతం ప్రదర్శిస్తుండడంతో దానిని కోరుకున్న టీచర్లు విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. తమ సీనియారిటీ ప్రకారం కోరుకున్న ఖాళీ లేనందున తమకు న్యాయం చేయాలని అధికారులను ప్రాధేయ పడుతున్నారు. మరోవైపు అనేక ఖాళీలను అధికారులు బ్లాక్ చేయడంతో వాటిపై ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయులు నైరాశ్యానికి గురవుతున్నారు. అన్ని ఖాళీలను ప్రదర్శించి ఉంటే తమకు న్యాయం జరిగేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావాల్సిన వారికి కేటాయించడానికి, ప్రభుత్వ బదిలీలకు అవకాశం కల్పించడానికే ఇలా చేశారని ఆరోపిస్తున్నారు.

పండితుల పదోన్నతుల్లో అభ్యంతరాల వెల్లువ

రాష్ట్రవ్యాప్తంగా భాషా పండితుల పదోన్నతులు ముగిసినప్పటికీ వివిధ కారణాలతో అధికారులు ఈ ప్రక్రియను జిల్లాలో ఆలస్యంగా చేపట్టారు. బుధవారం విద్యాశాఖ విడుదల చేసిన భాషాపండితుల సీనియారిటీ జాబితాపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో బుధవారం సాయంత్రం జరగాల్సిన కౌన్సెలింగ్ శుక్రవారానికి వాయిదా పడింది. ఇది పూర్తయితే గానీ భాషాపండితుల బదిలీలకు సంబంధించి సీనియారిటీ, ఖాళీల జాబితా తయారుకాదు. దీంతో పాటు మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కావాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ పలు అభ్యంతరాలతో నిలిచిపోయింది. ఆర్జేడీ జోక్యంతో సాయంత్రం ఆలస్యంగా ప్రారంభమైంది. ఉర్దూ మాధ్యమంలో సోషియల్ స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా ఆన్‌లైన్‌లో రాకపోవడంతో వారు రెండోసారి సైతం వెనుదిరిగి వెళ్లారు. జాబితా అందుబాటులోకి వచ్చాక తాము కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు వారికి సర్దిచెప్పారు.


చిన్నారులపై అత్యాచారయత్నం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ముగ్గురు చిన్నారులపై ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన చిత్తూరు జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. ఏర్పేడు ఎస్సై వెంకటరమణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం గోవిందవరంలోని ఓ కాలనీకి చెందిన నాలుగేళ్ల వయసున్న ముగ్గురు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన షేక్ మహ్మద్‌బాషా(30) మిఠాయి పెట్టి మాయ మాటలతో పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు కామాంధుడుకి దేహశుద్ధి చేసి ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


జయచంద్రనాయుడు మృతదేహం

నయనంపల్లె (పూతలపట్టు), న్యూస్‌టుడే: పూతలపట్టు మండలం నయనంపల్లె గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సాగు చేసిన పంటలు ఏమైనా దెబ్బతిన్నాయా అని చూడటానికి రైతు జయచంద్రనాయుడు (53) ఉదయం తన పంట పొలాల్లోకి వెళ్లాడు. ఒక గట్టుపై నడుచుకుంటూ వెళుతుండగా పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభం స్టే కమ్మీ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్క పంటపొలాల్లో ఉన్న రైతులు విషయాన్ని గమనించి జయచంద్రనాయుడిని విద్యుదాఘాతం నుంచి తప్పించారు. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి చెందాడు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ మేరకు పూతలపట్టు ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

రైలు ఢీకొని వృద్ధుడి...

కుప్పం న్యూస్‌టుడే: చెన్నై - బెంగుళూరు రైలు మార్గంలోని కుప్పం రైల్వే గేటు సమీపంలో రైలు ఢీ కొనడంతో వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే రక్షక నిలయ ప్రధాన భటుడు నాగరాజు తెలిపారు. గురువారం ఉదయం పదిన్నర గంటల సమయంలో కుప్పం రైల్వే గేటు దాటుతున్న వృద్ధుడిని సూపర్ పాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శాంతీపురం మండలం రామాపురం గ్రామానికి చెందిన నరసింహులు (67) ఉదయం ఆసుపత్రికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. కుప్పం రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా ఈ ఘటన జరిగిందని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, ఐదు మంది కుమార్తెలు ఉన్నట్లు చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బ్యాంకు పేరుతో టోకరా..!

ఖాతాలో ఉన్న రూ.40 వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి..ఓ వ్యక్తి ఖాతాలో నుంచి రూ.40 వేల నగదు కాజేసిన సంఘటన మదనపల్లె పట్టణంలో గురువారం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని కమ్మగడ్డవీధికి చెందిన నవాజ్‌పీర్ కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తాడు. ఇతని చరవాణికి ఉదయం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఏటీఎం పిన్ నంబరు అడిగారు. బ్యాంకు అధికారులే ఫోన్ చేశారని నమ్మి పిన్ నంబరు చెప్పాడు. అయితే కొంత సేపటికే తన ఖాతాలో ఉన్న రూ.40 వేలను ఏడు సార్లు డ్రా చేసినట్లు చరవాణికి సంక్షిప్త సమాచారం రావడంతో బాధితుడు బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. రెండోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బ్యాంకు అధికారులు బాధితుడు నవాజ్‌ఫీర్ ఖాతాకు సంబంధించిన ఏటీఎం పిన్ నంబరును బ్లాక్ చేశారు. కేసు విచారణ చేస్తున్నామని రెండోపట్టణ పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే : చిత్తూరు నగరం బజారువీధి సమీపంలోని ఆషాడం వీధిలో బుధవారం జరిగిన అఫ్రోజ్ హత్య వివాహేతర సంబంధం కారణంగానే జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నగరానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నెరపడంతో మహిళ సన్నిహితులు ఓర్వలేకపోయారు. దీంతో బుధవారం అఫ్రోజ్‌తో పాటు మరో ముగ్గురు చర్చివీధిలోని మద్యం దుకాణంలో మద్యం తాగారు. ఆపై ఆషాడం వీధికి చేరుకునేలోపు ఇద్దరు వ్యక్తులు అఫ్రోజ్‌ను పట్టుకోగా మరో వ్యక్తి తన వద్ద ఉన్న కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. హతులు చిత్తూరు నగరానికి చెందిన వారేనని, ముగ్గురు వ్యక్తులు హత్య ఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉండగా.. వారికి సంబంధించిన వ్యక్తులు, మహిళకు సంబంధించిన వ్యక్తులను గురువారం రాత్రి పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. రెండు, మూడ్రోజుల్లో హత్యకు కారణం, కారకుల వివరాలన్నీ పూర్తిగా తెలిసే అవకాశం ఉందని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో డీఎంకు గాయాలు

మదనపల్లె (అర్బన్), న్యూస్‌టుడే : మదనపల్లె ఒకటో డిపోకు నూతన డీఎంగా నియమితులైన రాజా గజలక్ష్మి గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మదనపల్లె ఒకటో డిపో డీఎంగా బాధ్యతలు స్వీకరించేందుకు మదనపల్లెకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో చిత్తూరు-1వ డిపోకు చెందిన బస్సులో మదనపల్లె వస్తుండగా.. పలమనేరు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కర్నాటక ఆర్టీసీ బస్సు, మదనపల్లెకు వస్తున్న ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డీఎం తలపైన స్వల్పంగా గాయమైంది. ఆమె సోదరుడికి కూడా గాయాలు తగిలినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సంఘటన జరిగిన తర్వాత డీఎం రాజా గజలక్ష్మి డిపోకు చేరుకుని డిపోకు నూతన మేనేజరుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సంఘటన తెలుసుకుని పలువురు కార్మికులు డీఎంను పరామర్శించారు.

పట్టుగూళ్ల ధరలు

కనిష్టం	361.45
గరిష్టం	480.00
సగటు	369.97

టమోటా ధరలు

ఏ.గ్రేడ్	32.00-44.00
బి.గ్రేడ్	18.00-30.00



శకటాల తయారీ ప్రాంతంలో ఇలా...



వేదిక వద్ద పర్యవేక్షిస్తున్న డీజీ ప్రభాకరరావు, తిరుపతిఎస్పీ మహంతి తదితరులు



మైదానంలో బురద ఉన్నచోట రాతి పొడి జల్లుతున్న దృశ్యాలు

మేఘమా.. కురవకే..



బురదలోనే కవాతు

- ✻ అంతా బురదమయం
- ✻ కొనసాగుతున్న పనులు
- ✻ పంద్రాగస్టుకు అవాంతరాలు
- ✻ వాతావరణ మార్పులతో అప్రమత్తం
- ✻ మైదానంలోనే జిల్లా యంత్రాంగం

ఈనాడు-తిరుపతి

కారుమేఘం కమ్ముతోంది.. రాత్రివేళకు వరుణుడు అలానే వచ్చేస్తున్నాడు.. ఒకవైపు అన్నదాతకు ఆనందమే అయినా.. మరోవైపు పంద్రాగస్టు వేడుకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలో వైభవంగా నిర్వహించాలన్న సంకల్పానికి వరుణుడు ఒకింత ఆటంకం కల్పిస్తున్నాడు.. గత కొద్దిరోజులుగా తారకరామా మైదానం వేదికగా చేపట్టిన వేడుకల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి జెండా పండుగకు సర్వం సిద్ధం చేయాలన్న అధికారుల సంకల్పంపై వరుణుడు అడపాదడపా నీళ్లు జల్లుతూ ఆందోళన రేకెత్తిస్తున్నాడు. తిరుపతిలోనే జిల్లా యంత్రాంగం మకాంవేసి నిత్యం రేయింబవళ్లు పర్యవేక్షిస్తున్నా రానున్న రెండ్రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికలతో అధికారుల్లో కలవరం మొదలైంది. తారకరామా మైదానాన్ని పంద్రాగసుల వేడుకల కోసం అధికారులు ముస్తాబు చేస్తున్నారు. అయితే వర్షం కారణంగా పనులకు ఆటంకం ఎదురవుతోంది. ఇప్పటికే కవాతు చేసే ట్రాక్‌ను సిద్ధం చేయగా వర్షం కారణంగా అదికాస్తా చిత్తడిగా మారింది. దీంతో అధికారులు మళ్లీ పనులను చేపట్టారు. వాస్తవానికి పదోతేదీ నాటికే ఆయా పనులు పూర్తి చేస్తామని అధికారులు చెప్పినా.. నేటికి ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. వీఐపీలతో బాటు వేడుకలను చూసేందుకు వచ్చే వీక్షకుల గ్యాలరీలు ఇంకా పూర్తి కాలేదు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండే వీలుగా పైన రేకులు ఏర్పాటు ఇంకా కొన్నిచోట్ల పూర్తికాలేదు. ముఖ్యంగా కవాతు నిర్వహించే ట్రాక్ దెబ్బతినడంతో ముందస్తుగా రిహార్సల్స్ చేస్తునవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం దీన్ని సరిచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వాస్తవానికి కవాతు నిర్వహించే ట్రాక్ సుమారు ఆరు అంగుళాల మేర ఎత్తుగా ఉంటుందని దానిపై వెళ్తుంటే హుందాగా ఉండేదని కొందరు సిబ్బంది చెబుతున్నారు. అయితే ప్రస్తుతం తారకరామా మైదానంలో మాత్రం కేవలం నేలపైనే కొంత ఎర్రమట్టిని వేసి ట్రాక్‌గా రూపొందించారు. దీనిపై కవాతు చేస్తున్నా సంతృప్తిగా లేదని పలువురు వాపోయారు. అదీకాక కవాతుకు వందనం చేసేందుకు ముఖ్యమంత్రి వాహనం ప్రయాణించే ట్రాక్ సైతం వర్షం కారణంగా దెబ్బతింది. దీంతో హుటాహుటిన ఆయా పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఒకవేళ వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా చేసేందుకు ట్రాక్ మొత్తం బీటీ వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

పట్టించుకునే వారేరీ....

ముందస్తు కవాతు కసరత్తు(ప్రాక్టీసు) చేస్తున్న సిబ్బందికి.. అధికారుల సమన్వయ లోపం ఇబ్బందిగా మారింది. సుమారు వెయ్యి మంది సిబ్బంది ఉదయం, సాయంత్రం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం మైదానంలో కసరత్తు చేస్తున్నారు. అయితే వీరికి ఒక్క మరుగుదొడ్డి కూడా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైదానంలో ఉన్న మరుగుదొడ్డికి విశ్వవిద్యాలయానికి చెందిన అధికారులు తాళం వేసుకోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్డిని తెరవాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించినా విశ్వవిద్యాలయ వర్గాలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కవాతులో ఎక్కువ సంఖ్యలో మహిళలు ఉన్నారు. వారు ఎవరికీ చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారు. ఒకవైపు స్వచ్ఛభారత్ అంటూ నిత్యం నినాదాలు ఇచ్చేవారు ఇప్పుడు కనీసం అక్కడ తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు.

నత్తనడకన సుందరీకరణ..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి ప్రముఖులు వేడుకలకు హాజరవుతారని ఇప్పటికే అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి అవసరమైన వసతుల కల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. సుందరీకరణ పనులు ఇంకా నెమ్మదిగానే జరుగుతున్నాయి. కేవలం మైదానం ఎదురుగా ఉన్న సెంట్రల్ మీడియన్‌కు మాత్రమే రంగులు వేశారు. విశ్వవిద్యాలయంలో రహదారి పక్కన ఉన్న నడకదారిపై గతంలో ఏర్పాటు చేసిన టైల్స్ దెబ్బతిన్నా వాటిని పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం విద్యుత్తు దీపాలను సరిచేస్తున్నారు. సుందరీకరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు ఇప్పటికైనా ఆయా పనులను మరింత వేగిరం చేస్తేనే కనీసం 14వతేదీ ఉదయానికైనా చక్కటి రూపురేఖలు వచ్చే అవకాశం ఉంది. మరోవైపున వేడుకలు ముగిసేవరకు వరుణుడు కరుణించి అంతా సవ్యంగా సాగిపోయేలా చూడాలని జిల్లా యంత్రాంగం ఏడుకొండలసామిని మొక్కుతోంది.

కొనసాగుతున్న వ్యవసాయ విద్యార్థుల ఆందోళన



వ్యవసాయ కళాశాల ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు జీవో నెంబరు 64ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. నకిలీ వ్యవసాయ విద్యను ప్రోత్సహించేలా ఉన్న ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 4నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విద్యార్థులు నిరసనలు చేపట్టారు. దీనిలో భాగంగా తిరుపతిలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆందోళనలు ప్రారంభించారు. విద్యార్థులు తరగతులు బహిష్కరించి కళాశాల ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నాలు నిర్వహించారు. వ్యవసాయ విద్యలో నాణ్యతకు ప్రామాణికమైన ఐసీఏఆర్ గుర్తింపు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం బాధాకరం అని, ఈ నిర్ణయంతో వ్యవసాయ విద్య నిర్వీర్యం కావడంతో బాటు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నోటికి నల్లటి వస్త్రాలు కట్టుకుని కళాశాల ఎదుట బైఠాయించారు. అధ్యాపకులను, సిబ్బందిని కళాశాలలోని అనుమతించకపోవడంతో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రాజరాజేశ్వరి, పాలక మండలి సభ్యులు డాక్టర్ కోటేశ్వరరావు విద్యార్థులతో చర్చించారు. విద్యార్థుల ఆందోళనలతో రెండురోజుల పాటు విధులకు తీవ్రమైన ఆటంకం ఏర్పడిందని.. పాలనాపరమైన వ్యవహారాలు నిలిచిపోయాయని ఆమె తెలపడంతో గురువారం అధ్యాపకులు, సిబ్బందిని లోనికి అనుమతించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు చొరవ తీసుకుని రాష్ట్రంలో వ్యవసాయ విద్య విలువలను కాపాడాలని కోరారు. ఐసీఏఆర్ గుర్తింపులేని వ్యవసాయ విద్యను రాష్ట్రంలో బోధిస్తున్న ఇతర రాష్ట్రాల కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుపతి

15న కపిలతీర్థంలో గోకులాష్టమి

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ఈ నెల 15న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 6గంటలకు శ్రీ వేణుగోపాలస్వామి వారి మూలవర్లకు అభిషేకం, 10 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు స్వామివారికి వీధి ఉత్సవం, అనంతరం ఆస్థానంతో గోకులాష్టమి ఉత్సవం ముగుస్తుంది. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.



మాడవీధుల్లో ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

ముగిసిన ఆరాధనోత్సవాలు



తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: జగద్గురు శ్రీ మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి వారి 346వ ఆరాధన మహోత్సవాలను గురువారం వైభవంగా ముగిశాయి. తిరుపతి ఆర్ఎస్ గార్డెన్స్‌లోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో మూడురోజుల పాటు వైభవోపేతంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణ చేశారు. మధ్యాహ్నం స్వామివారిని రథోత్సవంపై ప్రతిష్ఠించి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎం.కె.రాఘవేంద్రరావు, అర్చకులు పద్మనాభచార్, ప్రసన్నచార్, వాదిరాజాచార్, గురురాజాచార్ తదితర సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తాళ్లపాక సిద్ధేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: కడప జిల్లా తాళ్లపాకలోని శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. ఆ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. తెలిసీతెలియక చోటుచేసుకునే దోషాలను నివారించేందుకు ఏటా మూడురోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 13న సాయంత్రం అంకురార్పణ, యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, వాస్తుపూజ, వాస్తుహోమం నిర్వహిస్తారు. 14న పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు ఉంటాయి. 15న యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, పవిత్ర వితరణ, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థినులు సమావేశాలు, సదస్సుల్లో పాల్గొని జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య వి.ఎస్.ఎస్.కుమార్ తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తరగతి గదిలో చెప్పే పాఠ్యాంశాలతో బాటు ఇతర పరిజ్ఞానాన్ని సైతం విద్యార్థినులు సంపాదించాలన్నారు. అప్పుడే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగ సాధన సాధ్యమవుతుందని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో వ్యవస్థను సక్రమంగా నడపడం నేర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్ లైబ్రరీ, ఇంక్యుబేషన్ సెంటర్, సమ్మర్, వింటర్ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. అనంతరం పలు పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల సంచాలకులు ఆచార్య రామకృష్ణారావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందచేస్తు న్న జేఎన్‌టీయూ వీసీ ఆచార్య వి.ఎస్.ఎస్.కుమార్

సమస్య మీది.. పరిష్కారం మాది...

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యల పరిష్కారానికి 'ఈనాడు- వాట్సాప్' విశేష కృషి చేస్తున్నది. నగరం నలుమూలల నుంచి ప్రజల సమస్యలను వాట్సాప్ ద్వారా సేకరించి వాటిని నగరపాలిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం చూపుతోంది. నగరంలోని పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల సతమతం అవుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది చేస్తున్న ఆలసత్వంపై 'ఈనాడు-వాట్సాప్' ప్రశ్నించి సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతుండటంతో పెద్దసంఖ్యలో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగా అందిన కొన్ని ఫిర్యాదులు, వాటి పరిష్కార మార్గాలు ఇవిగో..



సమస్య: తిరుచానూరు మార్గంలోని లక్ష్మీపురంలో ఇంటినెంబరు 19-9-29/14 వద్ద మురుగునీరు నిల్వ ఉంది. వర్షపునీరు, మురుగునీరు కలిసి పెద్దఎత్తున నిల్వ చేరింది. ఈ మార్గంలో చాలా అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంది. ఈ మురుగు నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ మురుగునీటి వల్ల చాలా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

-స్థానికులు, లక్ష్మీపురం

సమాధానం: నీటి నిల్వకు కారణం గుర్తించి సమస్యను పరిష్కరిస్తాం. **-డాక్టర్ ఉషాకుమారి, నగరపాలిక వైద్యాధికారిణి**



సమస్య: రాయల్‌చెరువు రోడ్డులో మురుగునీటి కాలువలను సక్రమంగా శుభ్రం చేయడం లేదు. పలు వీధుల్లో కాలువలు మురుగునీటితో నిండిపోయాయి. ఆర్టీసీ రోడ్డులోని ఇంటి నెంబరు 8 వద్ద ఉన్న మురుగునీటి కాలువను శుభ్రం చేసి రెండు వారాలైంది. దీంతో మురుగునీరు కాలువలో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. మురుగునీటితో బాటు వ్యర్థాలు కాలువలో చేరి చాలా ఇబ్బంది కలిగిస్తున్నాయి.

-స్థానికులు, ఆర్టీసీ రోడ్డు

సమాధానం: సమస్యను వెంటనే పరిష్కరించేలా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశిస్తాం.

-డాక్టర్ ఉషాకుమారి, వైద్యాధికారిణి, నగరపాలిక



మరమ్మతులకు నోచుకోక చెత్తతో నిండి కింద పడిన చెత్తకుండీ

నూతన చెత్త కుండీ ఏర్పాటు

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే

నగరంలోని సప్తగిరినగర్‌లో నెలకొన్న సమస్యలపై ఈ నెల అయిదోతేదీన 'సమస్యల నెలవు.. స్పందన కరవు' అనే శీర్షికన 'ఈనాడు' మినీలో ప్రచురితమైన కథనానికి స్పందించిన నగరపాలక అధికారులు కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. చెత్తకుండీ పూర్తిగా ధ్వంసమై ఉండటంతో దాన్ని మరమ్మతులకు తీసుకెళ్లి, మరొక కుండీని అక్కడ ఏర్పాటు చేశారు.



నూతనంగా ఏర్పాటు చేసిన చెత్తకుండీ

మీ డివిజన్‌లో సమస్యలా? రహదారులు దెబ్బతిన్నాయా? కాలువల్లో మురుగు నిండిందా? రహదారుల వెంట చెత్త దర్శనమిస్తోందా?.. ఇలాంటి సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి 'ఈనాడు' మీకో అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా డివిజన్‌లో సమస్యపై ఫొటో తీసి, పేరు, చిరునామాతో ఈ కింద ఇచ్చిన వాట్సప్ నంబరుకు పంపించండి. సమస్యలను స్వయంగా పరిశీలించి ప్రచురిస్తాం..

మీరూ స్పందించండి

వాట్సాప్ నంబరు: 8008020003

ఎస్వీయూలో బంద్ సంపూర్ణం

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ వర్సిటీ కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించి విద్యార్థుల సంక్షేమానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లును వెనక్కు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం ప్రభుత్వానికి తగదన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదరం, బుజ్జిబాబు, కౌశిక్, ఆది, పవిత్ర, దుర్గ, మహేష్, హరి, రాము తదితరులు పాల్గొన్నారు.



తరగతులు బహిష్కరించిన విద్యార్థులు

వైభవంగా గంగజాతర

మంగళం(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లెలో గంగమ్మ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. మంగళవారం చాటింపుతో జాతర ప్రారంభమైంది. బుధవారం రాత్రి వరకు అమ్మవారి ఆరాధన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నడివీధి గంగమ్మకు పొంగళ్లు, అంబలి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన్ను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రజక సంఘాల ఆధ్వర్యంలో..

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి నగర పరిధి జీవకోనలోని రజక సంఘం నాయకులు తుడా ఛైర్మన్ నరసింహయాదవ్‌ను శుక్రవారం సన్మానించారు. రజక సంఘం నాయకుడు కె.సుధాకర్ మాట్లాడుతూ తెదేపా హయాంలో రజకులకు న్యాయం జరిగిందన్నారు. కులవృత్తులను చేసుకుంటున్న రజకులకు తుడా సహకారం కావాలని కోరారు. ఇక్కడి దోబీఘాట్‌కు నీటిసౌకర్యంతో బాటు, లోపల సదుపాయలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ పాక్షికం

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించేలా తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభుత్వ విద్యాసంస్థలు బలహీనపడి పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్ గురువారం పాక్షికంగా సాగింది. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బంద్‌కు స్వచ్ఛందంగా మద్దతు పలకగా, మరికొన్ని యథావిధిగా కొనసాగాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వాటిని విద్యార్థి సంఘాల నాయకులు దగ్గరుండి మూసివేయించారు. అనంతరం బాలాజీకాలనీ కూడలిలో విద్యార్థులతో కలిసి మానవహారం, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఏపీ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ సబ్‌యాక్ట్-2017ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించలేదని, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచకుండా వాటిని మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి సంఘ నాయకులు ఉదయ్, విష్ణు, రాఘవేంద్ర, వెంకటేష్, శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీకాలనీ కూడలిలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: నగరంలో పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నామని డీఈఈ నరేంద్రనాథ్ గురువారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గోవిందనగర్, లీలామహల్, ఎర్రమిట్ట, మధురా నగర్, తిరుమల బైపాస్‌రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఇంఛార్జ్ సంచాలకులు డాక్టర్‌బీసీఎం ప్రసాద్

వైద్యవృత్తిని సేవాభావంతో స్వీకరించండి

తిరుపతి(స్విమ్స్), న్యూస్‌టుడే: నేటి సమాజంలో యువతీ యువకులు వైద్యులు కావడం ఎంతో గొప్ప విషయమని.. అలాంటి పవిత్రమైన వైద్యవృత్తిని సేవాభావంతో స్వీకరించాలని స్విమ్స్ ఇంఛార్జ్ సంచాలకులు డాక్టర్ బీసీఎం ప్రసాద్ విద్యార్థినులకు పిలుపునిచ్చారు. గురువారం స్విమ్స్ వర్సిటీ అనుబంధ శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ 4వ బ్యాచ్ విద్యార్థినులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఇంఛార్జ్ సంచాలకులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లోకెల్లా వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఈ వృత్తి ద్వారా నిరుపేద రోగులకు సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత వైద్యవిద్యను అభ్యసించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థినులు చదువుతో బాటు ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొం దించుకోవాలని సూచించారు. స్విమ్స్ ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని. . వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ ర్యాగింగ్ చేయమని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎం.ఎస్ డాక్టర్ అలోక్‌సచన్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ పివిఎల్ఎన్ శ్రీనివాసరావు, డాక్టర్ వాసుదేవరెడ్డి, డాక్టర్ యర్రమరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మురుగు దారులు..

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- భరించలేని దుర్గంధం
- పట్టించుకోని అధికారులు
- అశోక్‌నగర్‌లో ఇదీ పరిస్థితి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే

ప్రముఖ చక్రవర్తి అశోకుని పేరున్న కాలనీ.. పేరుకు మాత్రం పెద్దల పేర్లు.. అక్కడ నెలకొన్న సమస్యలు సైతం అంతే పెద్దవి.. చిన్నపాటి సమస్యలను సైతం పరిష్కరించలేని దుస్థితిలో ఉన్న నగరపాలక యంత్రాంగం తీరుతో ప్రజలు సతమతమవుతున్నారు.. ప్రతివారం స్పందన.. డయల్ యువర్ కమిషనర్.. వాట్సాప్.. ఇలా ఎన్నో కార్యక్రమాల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నా పూర్తి స్థాయిలో ఆశించిన ఫలితాలు రావడమేలేదు.. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది.

ఇదీ పరిస్థితి..

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ మూడో వీధిలో నిత్యం మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవాహిస్తోంది. ఫలితంగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు చెప్పనలవి కావు. నాలుగైదు రోజులుగా మురుగునీరు రహదారిపైనే ప్రవహిస్తున్నా.. ప్రజలు తిప్పలు పడుతున్నా ఆలకించిన నాథుడే కరవయ్యారంటే ఆశ్చర్యం కలగకమానదు. దీనిపై స్థానికులు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం శూన్యం. ఈ వీధిలో ఓ ప్రైవేటు పాఠశాల కూడా ఉంది. ఉదయం, సాయంత్రం వందల మంది విద్యార్థులు ఇటుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతేకాకుండా వాహనాలు సైతం పెద్దసంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి.



రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

వాహనాలు వేగంగా వెళ్లడంతో ప్రవాహిస్తున్న మురుగు కాస్తా విద్యార్థులపై పడుతోందని స్థానికులు వాపోతున్నారు. పాదచారులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయం.. వీధిలో ఆడుకునే తమ పిల్లలు మురుగు నీటిలో పడిపోతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. ఫలితంగా తమ పిల్లలు అంటువ్యాధుల బారిన పడుతున్నారని చెబుతున్నారు. మురుగునీటిలో ఉంటే ఈగలు, దోమలు ఇళ్లల్లో స్వైరవిహారం చేస్తూ.. ఆహార పదార్థాలపై వాలుతున్నాయని వాపోతున్నారు. మురుగునీరు రోడ్డుపై ప్రవాహిస్తున్న అధికారులు స్పందించకపోవడం దారుణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎవరూ ఆలకించడం లేదు



వీధిలో సమస్యపై విన్నవించని అధికారులు లేరు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా.. ఫోటోలు పెట్టినా పట్టించుకోవడం లేదు. మా భాద ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. వాసనకు తట్టుకోలేక దుకాణానికి మూత వేసే పరిస్థితి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరిస్తే పుణ్యం ఉంటుంది. **-మధు, దుకాణాదారుడు**

దుర్వాసన భరించలేకపోతున్నాం



వీధిలో సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడమే లేదు. మురుగు నుంచి వచ్చే దుర్వాసన భరించలేక పోతున్నాం. పాఠశాల విద్యార్థులు మురుగులోనే వెళ్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.

-ప్రభాకర్, స్థానికుడు



అక్షయ క్షేత్రం ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న విద్యార్థులు

అక్షయ క్షేత్రంలో స్వచ్ఛభారత్

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల విద్యార్థులు స్వచ్ఛపక్వాడా పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులు తిరుపతి సమీపంలోని దుర్గసముద్రం వద్ద ఉన్న అక్షయక్షేత్రం అనాధాశ్రమంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఆశ్రమ అవరణలోని పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. అవరణలో మొక్కలు నాటి వాటికి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. గతంలో నాటిన మొక్కలకు పాదులు చేసి మరింత వేగంగా ఎదిగేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్య కళాశాల అసోసియేట్ డాక్టర్ ఈశ్వరప్రసాద్, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ ప్రకాష్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు సామాజిక సేవ గురించి వివరించారు. ఎందరో వికలాంగులు ఆశ్రయం పొందుతున్న అక్షయక్షేత్రంలో స్వచ్ఛభారత్ నిర్వహించడం అదృష్టంగా భావించాలని వారు విద్యార్థులకు తెలియజెప్పారు.

తిరుపతి సినిమా



ప్రతాప్ - ఫిదా
జయశ్యామ్- జయ జానకీ నాయక
విఖ్యాత్- లై
బిగ్‌సినిమా- లై
వేల్‌రామ్స్- నేనేరాజు నేనేమంత్రి
జగత్- ఫిదా
శ్రీనివాస- నేనేరాజు నేనేమంత్రి
కృష్ణతేజ- నేనేరాజు నేనేమంత్రి
సంధ్య - లై
సీవీఎస్- గౌతమనంద
మినీ ప్రతాప్- డిజె దువ్వాడజగన్నాథం
శ్రీనివాసతేజ- వశం
పీజీఆర్- జయ జానకీ నాయక
తేజ - ఇదేమి దెయ్యం
ఐ.ఎస్.మహల్- ఏజెంట్ భైరవ
పళణి- నిబునన్ (తమిళం)

12, 13తేదీల్లో 'మనసు పాడింది.. సన్నాయి పాట'

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తితిదే ధర్మప్రచార పరిషత్ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ సంయుక్తంగా ఈ నెల 12, 13 తేదీల్లో 'మనసు పాడింది.. సన్నాయి పాట' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం తెలుగుకు సేవ చేస్తూ, సినీ కళామతల్లిని పాటలతో మైమరిపించిన అద్భుత సృజనశీలి డాక్టర్ సి.నా.రె అని కొనియాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 12, 13 తేదీల్లో మహతి కళాక్షేత్రం వేదికగా రెండురోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఫిలిం సొసైటీ సభ్యులు శేషగిరిరావు, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: తిరుపతిలోని రైతు బజారులో కూరగాయల ధర(కిలో)ల వివరాలను ఎస్టేట్ అధికారి అక్తర్ షరీఫ్ తెలిపారు.

గురువారం నాటి ధరలు ఇలా...

టమోటా- రూ.28, వంకాయలు- రూ.26, రూ.40 బెండకాయలు- రూ.20, మిరపకాయలు- రూ.40, రూ.50, కాకరకాయలు- రూ.30, బీరకాయలు- రూ.24, కాలిఫ్లవర్- రూ.25, అల్లం- రూ.45, రూ.60, క్యారెట్- రూ.56, క్యాబేజి- రూ.15, దొండకాయలు- రూ.20, సొరకాయలు- రూ.10, ఉర్లగడ్డలు- రూ.18, తెల్లగడ్డలు- రూ.60, ఎర్రగడ్డలు- రూ.25, రూ.30, చామగడ్డలు- రూ.30, కందగడ్డలు- రూ.40, పందిరి చిక్కుడు- రూ.38, గోరుచిక్కుడు- రూ.22, దోస కాయలు- రూ.18, అరటికాయ(1)- రూ.8, మునక్కాయలు- రూ.45, బీట్‌రూట్- రూ.30, ముల్లంగి- రూ.20, బీన్స్- రూ.38, ఆకు కూరలు- రూ.5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 8 గంటల వరకు అమలులో ఉంటాయి.

పంద్రాగస్టు సంబరాల వీక్షణకు ఎల్ఈడీ తెరలు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతిలో నిర్వహించనున్న 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నగరవాసులు తిలకించేలా నాలుగు ప్రధాన రద్దీ ప్రాంతాలలో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేయనున్నట్లు నగరపాలిక కమిషనర్ సీహెచ్ హరికిరణ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించేందుకు సుమారు 70 నుంచి 80వేల మంది ప్రజలు వస్తున్నారని వారి సౌకర్యార్థం రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నగరపాలిక కార్యాలయ కూడలి, తిరుమల బైపాస్ మార్గంలోని ప్రకాశం పార్కు వద్ద ఆధునాతన తెరలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నగరపాలికకు సంబంధించిన పనులను ఆయన పర్యవేక్షించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

అలుపెరుగని పోరాటాలు చేసిన యూటీఎఫ్


తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: అధ్యయనం, అభ్యాసనం రెండు కళ్లుగా చేసుకుని యూటీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.జనార్ధన్‌రెడ్డి అన్నారు. యూటీఎఫ్ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం తిరుపతి పెద్దకాపు లే అవుట్‌లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి మునిరామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తొలి నుంచి యూటీఎఫ్ సామాజిక స్పృహతో పనిచేసిందన్నారు. 1974 ఆగస్టు 10వతేదీన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అవిర్భవించిందన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సాధించడంలో ఫెడరేషన్ కృషి ఎనలేనిదన్నారు. ఈ సమావేశంలో నాయకులు బండి మధుసూధన్ రెడ్డి, ఎన్.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జనార్దన్‌రెడ్డి

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టండి

తుమ్మలగుంట, తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: తుమ్మలగుంట పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని గురువారం స్థానికులు కోరారు. స్థానిక కార్యాలయంలో ఎంపీడీవో రూపేంద్రనాధ్‌రెడ్డికి తుమ్మలగుంట సర్పంచిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ వార్డు సమావేశాల్లో తీర్మానం చేసుకోకనే ఇష్టానుసారం పనులు చేసుకుంటున్నారని వాపోయారు. గ్రామం నుంచి చెరువులోకి వెళ్లే రోడ్డును గతంలో తుడా నిధులతో నిర్మించారని తెలిపారు. మళ్లీ ఇటీవల ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు గ్రావెల్ నింపి రూ.6లక్షలు సర్పంచి నిధులు డ్రా చేసుకుని దుర్వినియోగం చేశారని చెప్పారు. మరలా ఇదే రోడ్డుకు గుంతలు పూడ్చాలని రూ.2లక్షలకు అంచనాలు రూపొందించి, దీనికి అదనంగా మరో రూ.2లక్షలు అంచనాలు రూపొందించి నిధులు డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పంచాయతీలో తీర్మానం తీసుకోకనే పలు పనులు చేసి రూ.లక్షల నిధులు దుర్వినియోగం చేశారని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో రికార్డులు తెప్పించుకుని పరిశీలించి నిధులు దుర్వినియోగం అయినట్టు తేలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినత పత్రం సమర్పించిన వారిలో ఉప సర్పంచి గోవిందరెడ్డి, వార్డు సభ్యులు రఘునాధరెడ్డి, రాధాకృష్ణ, వరదరాజులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎంపీడీవో రూపేంద్రనాధరెడ్డికి వినతి ఇస్తున్న ఉప సర్పంచి గోవిందరెడ్డి వార్డు సభ్యులు

గోవిందధామం ఆదర్శనీయం

సభాపతి కోడెల శివప్రసాదరావు




ధ్వజస్తంభానికి మొక్కుతున్న సభాపతి డాక్టర్ శివప్రసాదరావు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో నిర్మించిన గోవిందధామం శ్మశానవాటిక ఆదర్శనీయమని రాష్ట్ర శాసన సభాపతి కోడెల శివప్రసాదరావు తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలు, శతాబ్దాలుగా కార్యరూపం దాల్చని శ్మశాన వాటిక దేశంలోనే మొదటగా అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. శ్రావణమాసం... పరమపవిత్రమైన పర్వదినాన శ్రీవారిని దర్శించుకున్నానని, మంచి వర్షం కురిసిన వేళ స్వామివారి సేవలో పాల్గొన్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. తిరుమల క్షేత్రం పర్యావరణం.. పరిశుభ్రతకు నిలయంగా ఉందని అన్నారు. సభాపతికి తిరుపతి జేఈవో పోలా భాస్కర్ స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు. ఆయన వెంట తితిదే వసతి కల్పన విభాగం డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఓఎస్డీ లక్ష్మీనారాయణ యాదవ్ ఉన్నారు.

హుండీ ఆదాయం అధికం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి హుండీ ఆదాయం గురువారం అధిక మొత్తంలో వచ్చింది. శ్రీవారికి భక్తులు బుధవారం సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3.67 కోట్లు మేర వచ్చినట్లు వెల్లడయింది. యాత్రికుల రద్దీ అధికంగా ఉండడంతో హుండీ ఆదాయం మొత్తం ఎక్కువగా వచ్చింది.





సినీనటుడు నితిన్, నటి మేఘా ఆకాష్, తమిళనటుడు నటుడు కార్తి

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని పలువురు సినీ ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో సినీనటులు నితిన్, నటి మేఘా ఆకాష్‌తో పాటు 'లై' చిత్ర బృందం దర్శించుకుంది. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ తాను నటించిన లై చిత్రం విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. అలాగే తమిళ నటుడు కార్తి కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు తిరుపతి వేదం మొబైల్స్ అధినేత ప్రభాకర్ ఉన్నారు.

17న కాణిపాకం ఆలయానికి మహా సంప్రోక్షణ

స్వర్ణ శిఖర ప్రతిష్ఠకు చురుగ్గా ఏర్పాట్లు



గోపురాలపై ప్రతిష్ఠ చేయడానికి సిద్ధంగా ఉన్న స్వర్ణ కలశాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయానికి ఈ నెల 17వ తేదీన మహా సంప్రోక్షణ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... నెల్లూరుకు చెందిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి సొంత నిధులతో స్వామివారి ఆలయంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఈవో వివరించారు. ఈ క్రమంలో ఆలయంలోని ప్రధాన రాజగోపురం, విమాన, పశ్చిమ, శ్రీవీరాంజనేయస్వామి ఆలయ గోపురాలకు స్వర్ణ కలశాలు ప్రతిష్ఠించనున్నట్లు తెలియజేశారు. మొత్తం 14 స్వర్ణ కలశాలను దాత అందించినట్లు వివరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నట్లు ఈవో తెలిపారు. 15, 16, 17 తేదీల్లో ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిప్పారు.

అరకొర జమ.. పరిహారం మమ!

(మొదటి పేజీ తరువాయి) నేటికీ పూర్తి స్థాయిలో నగదు జమ కాలేదు.. తప్పులు.. సవరణల పేరుతో వ్యవసాయాధికారులు అన్నదాతలను ముప్పతిప్పలు పెడుతున్నారు.. తమ గోడు వెళ్లబోసుకునేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఆలకించేనాథుడే లేడు. అదేమిటని ప్రశ్నిస్తే.. తమకేమీ సంబంధం లేదని సమాధానం వస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.163కోట్లు విడుదల

గతేడాది తీవ్ర వర్షాభావం కారణంగా వేరుసెనగ పంట ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ పంట నష్టంపై అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. గత నెలలో ప్రభుత్వం పంట నష్ట పరిహారంగా హెక్టారుకు రూ.15వేల చొప్పున 2,14,985 మంది రైతులకు రూ.163కోట్లు మంజూరు చేసింది. మండల వ్యవసాయాధికారులు రైతుల వారీగా నష్టపోయిన పంట విస్తీర్ణం, బ్యాంకు, ఆధార్ సంఖ్య తదితర వివరాలను సమగ్రంగా అంతర్జాలంలో నమోదు చేసి జిల్లా వ్యవసాయ శాఖకు సమర్పించారు. వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారులు.. ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లను సరిచూసి తొలివిడత 2.09లక్షల మంది రైతులకు రూ.157.8కోట్లు పంట నష్ట పరిహారం బిల్లును జిల్లా ఖజానా శాఖకు అందజేశారు. రైతుల బ్యాంకు, ఆధార్ ఖాతా నంబర్లను సవరించాలనే కారణంతో మిగిలిన రూ.5.2కోట్లు నగదుకు సంబంధించి బిల్లు ఇంకా ఖజానా శాఖకు అందచేయలేదు.

ఏటా ఇదే తంతు..

పంట నష్టపరిహారం నగదు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడంలో ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోంది. 2015 పంట నష్టపరిహారం నగదు జమలో ఎదురైన సమస్యలే ఈ ఏడాదీ పునరావృతమయ్యాయి. అధికారుల అలసత్వానికి 2015 పరిహారంలో 20వేల మంది రైతులకు జమ కావాల్సిన సుమారు రూ.10కోట్లు నేటికీ అందలేదు. అప్పట్లో ఎదురైన తప్పులు పునరావృతం కాకుండా చూడాల్సిన వ్యవసాయ, గ్రామ రెవెన్యూ అధికారులు అదే తప్పులను మళ్లీ చేయడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు అందజేసిన పంట నష్టపరిహారం వివరాలను సమగ్రంగా చూసి అంతర్జాలంలో నమోదు చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రైతులే కదా..ఏం ఫర్వాలేదు అన్న రీతిలో ఇష్టారీతిన బ్యాంకు, ఆధార్ నంబర్లను నమోదు చేశారు.



ఈ చిత్రంలోని రైతు పేరు వెంకటముని నాయుడు. ఊరు పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ వీకేపల్లి. రెండు ఎకరాల్లో వేరుసెనగ పంట సాగుచేయగా పరిహారం కింద రూ.12 వేలు మంజూరైంది. ఈయనతోపాటు గ్రామంలోని 220మంది రైతులకు పరిహారం మంజూరై రెండు నెలలైనా ఇంకా అందలేదు. ఆధార్ నంబర్లు తప్పుగా ఉన్నాయంటూ అధికారులు తిప్పుకుంటున్నారు.

సమయం లేదట..

చేసిన తప్పులను సరిదిద్దాల్సిన వ్యవసాయశాఖ అధికారులకు సమయం చాలడం లేదట. ఎన్నిరోజుల్లో సమగ్ర నివేదికలను అందజేస్తారనేది వారు చెప్పలేకపోతుండటం గమనార్హం. పరిహారం నగదు జమపై పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారు. పంట నష్టపరిహారం జమ చేయడంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి.. మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వరకు అంతా నిర్లక్ష్య ధోరణే. మొదటి బిల్లులో నగదు జమకాని రైతుల ఖాతాల వివరాలు ఖజానా శాఖ నుంచి జేడీ కార్యాలయానికి వచ్చి ఇప్పటికి నెలరోజులైంది. నేటికీ మండలాల నుంచి వివరాలు అందలేదు. ఖజానా శాఖకే బిల్లు పెట్టని మరో రూ.5.2కోట్లకు సంబంధించి రైతుల వివరాలు సమగ్రంగా చేరనేలేదు. పరిహారం అందని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. పరిహారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రైతులకు సరైన సమాధానం చెప్పేవారే కరవయ్యారు.

ఫిర్యాదుల వెల్లువ

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రతి మంగళవారం 'రైతు కోసం ఫోన్-ఇన్' కార్యక్రమం నిర్వహిస్తారు. గత రెండు నెలలుగా పంట నష్ట పరిహారం నగదు జమకాలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. త్వరలో పరిహారం అందజేస్తామని చెబుతున్న అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదు. జిల్లా పాలనాధికారి స్పందించి పంట నష్ట పరిహారం నగదు జమకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. ఎక్కడ తప్పులు జరిగాయో గుర్తించి.. సత్వరమే నగదు జమచేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

15లోగా పరిహారం జమ

వేరుసెనగ పంట నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో ఈ నెల 15వ తేదీలోగా లబ్ధిదారులందరికి జమ చేస్తాం. బ్యాంకు, ఆధార్ నంబర్ల తప్పుల కారణంగా కొందరి రైతులకు పరిహారం నగదు జమ చేయడంలో ఆలస్యమైంది. ఏడు మండలాలకు చెందిన జాబితాలోని తప్పులను సవరించిన బిల్లును జిల్లా ఖజానా శాఖకు సమర్పించి రైతుల ఖాతాలకు జమ చేశాం. తప్పుల సవరణ జాబితాను సత్వరమే పంపాలని ఇప్పటికే మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. జాబితాలో పేరున్న రైతులందరికీ పరిహారం నగదును అందచేస్తాం.

- విజయకుమార్, జేడీ, వ్యవసాయ శాఖ

రెండు బస్సులు ఢీ

పది మందికి గాయాలు



బస్సులు ఢీకొన్న దృశ్యం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: బెంగళూరు, చెన్నై జాతీయరహదారిలోని మొగిలిఘాట్‌రోడ్డులోని దొరచెరువు సమీపంలో గురువారం రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో 10 మందికి గాయాలు తగిలాయి. వీరు పలమనేరు, బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. చిత్తూరు నుంచి మదనపల్లెకు వెళుతున్న ఏపీ ఆర్టీసీ బస్సు, బెంగళూరు నుంచి తిరుపతి వెళుతున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్(42)శాంతమ్మ(37), శాంత(42), ప్రభావతి(44), కండక్టరు రూపశ్రీ(26), పెద్దబ్బ(72), హరిబాబు(27), దాము(33) మల్లి(40), సులెమ్మ(40) గాయాలపాలయ్యారు. వీరిని 108 వాహనాల్లో బంగారుపాళ్యం, పలమనేరు ఆస్పత్రులకు తరలించారు. ఎస్సై నెట్టికంఠయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఆర్‌పురంలో నకిలీ పాసుపుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి) కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ప్రద్యుమ్న అదే రోజు స్పందించారు. విచారించి నివేదిక సిద్ధం చేయమని చిత్తూరు ఆర్డీవో కోదండరామిరెడ్డిని ఆదేశించారు. ఎస్‌ఆర్‌పురంతో పాటు జిల్లాలో భూఆక్రమణలు, ఆన్‌లైన్‌లో తప్పుడు వివరాలు నమోదు చేయడం వంటి సమస్యలు రామచంద్రాపురం, కార్వేటినగరం మండలాల్లోనూ ఉన్నాయి. వాటినీ 'ఈనాడు' వెలికితీసింది. ఈ క్రమంలో వాటన్నింటినీ విచారించి నివేదించాలని ఆయన ఆర్డీవోను ఆదేశించారు. ఈ క్రమంలో ఎస్‌ఆర్‌పురంలో నకిలీ పుస్తకాల తయారీ గురించి 'ఈనాడు'లో వచ్చిన కథనం అక్షరసత్యమని అధికారుల విచారణలో తేలింది. ప్రాథమిక విచారణలోనే 10 నకిలీ పుస్తకాలు (ఆన్‌లైన్‌లో తప్పుడు వివరాలు నమోదు చేయడం) గుర్తించారు. పదింటి వివరాలను బెంగళూరు, చెన్నై, చిత్తూరు, తిరపతి నగరాల్లోని కంప్యూటర్లలో నుంచి ఆన్‌లైన్‌లో ఎక్కించారు. ఇంకోటి ఎస్‌ఆర్‌పురం తహసీల్దార్ కార్యాలయం నుంచి నమోదు చేశారు. స్థానిక కార్యాలయం నుంచి నమోదు చేయడం సాధారణం. ఇతర నగరాల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం గమనార్హం.

14న కృష్ణాష్టమి వేడుకలు

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ గోశాలలో ఈ నెల 14వ తేదీన 'కృష్ణాష్టమి' వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ, ధర్మపరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపూజ నిర్వహిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈవో వివరించారు.

చాకలితిప్ప స్వాహాయణంపై

పాలనాధికారికి నివేదిక

ఈనాడు కథనానికి స్పందన

నాగలాపురం, న్యూస్‌టుడే: చాకలితిప్ప భూకుంభకోణంపై జిల్లా పాలనాధికారికి సమగ్ర నివేదికను గురువారం సమర్పించినట్లు తహసీల్దారు రేణుకమ్మ తెలిపారు. ఈ నెల ఎనిదోవ తేదీన "కొండను మింగిన ఘనులు" శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆమె రెండు రోజులుగా రెవెన్యూ రికార్డులతో పాటు సంబంధిత పట్టాదారుల వివరాలను పూర్తిగా పరిశీలించారు. చాకలితిప్ప పూర్తిగా ప్రభుత్వ భూమిగా ఉన్నా నాటి తహసీల్దారు వెంకట్రాయులు, సాంసన్ దేవ సుధాకర్‌ల హయాంలో ఎటువంటి ప్రొసీడింగ్స్ లేకనే పట్టాలను మంజూరు చేసినట్లు ఆమె నిర్ధారించారు. అలానే ఈ భూములకు సంబంధించిన దస్త్రాల్లో తహసీల్దారు సంతకాల స్థానంలో విధి నిర్వహణలో లేని మునుపటి తహసీల్దారు రాజు సంతకాలను ఫోర్జరీ చేసి ఆమె నిర్ధరించారు. తహసీల్దారు రాజు సంతకాలను ఫోర్జరీతో ఇంటి దొంగలే నకిలీ పాసుపుస్తకాలను తయారు చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ జిల్లా పాలనాధికారికి నివేదిక సమర్పించారు. చాకలితిప్పలో మంజూరు చేసిన అన్ని పట్టాలను రద్దు చేయటంతో పాటు ఈ తప్పులకు కారణమైన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిందిగా నివేదికలో పేర్కొనట్లు న్యూస్ టుడేకి తెలిపారు.

వీఆర్‌కు తిరుచానూరు సీఐ సురేంద్రనాయుడు



తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుచానూరు సీఐ సురేంద్రనాయుడిని వీఆర్‌కు బదిలీ చేస్తూ అర్బన్ జిల్లా ఎస్పీ అభిషేక్ మహంతి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం తిరుచానూరు పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తున్న సురేంద్రనాయుడు ఇక్కడ రెండేళ్లుగా బాధ్యతలు నిర్వర్తించిన సమయం ముగియడంతో.. పాలనా సౌలభ్యం కోసం ఆయన్ను ఇక్కడినుంచి బదిలీ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అయితే అనధికార సమాచారం మేరకు.. ఇటీవల తిరుచానూరు సీఐపై ఓ భూ వివాదానికి సంబంధించి దామినేడు గ్రామస్థులు అర్బన్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అంతర్గత విచారణ చేపట్టిన ఎస్పీ ఆ వివాదంలో సీఐ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఈ కారణంగానే తిరుచానూరు సీఐను అకస్మాత్తుగా వీఆర్‌కు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా భూ దందాల్లో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై ప్రత్యేక నిఘా ఉంచారు. అంతర్గత నివేదికల ఆధారంగా అవినీతికి పాల్పడుతున్న పోలీసు అధికారులపై ఉక్కుపాదం మోపుతున్నారు.

వైభవోపేతంగా పంద్రాగస్టు వేడుకలు

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: పంద్రాగస్టు వేడుకలు వైభవోతంగా నిర్వహించేందుకు కార్యోన్ముఖులు కావాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. గురువారం పంద్రాగస్టు ఏర్పాట్లపై తారకరామ స్టేడియంలో అధికారులతో సమీక్ష నిర్వహించి మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. పంద్రాగస్టు వేడుకల్లో చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయా పనులు కేటాయించిన అధికారుల్లో మార్పు రావాలంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకలకు సంబంధించి మొత్తం 45అంశాలపై ఆయన సమీక్షించారు. ప్రధానంగా పారిశుద్ధ్య లోపం పట్ల డీఈఈ ప్రభాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశభక్తి ఉట్టిపడేలా నగరంలోని ప్రతి వృక్షానికి జెండా రంగును అద్దితే బాగుంటుందని నగరపాలక కమిషనర్ హరికిరణ్ ఇచ్చిన సూచన మేరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు నేటి నుంచి సెలవులు రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతిఒక్కరు తిరుపతిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఇక్కడే బస ఏర్పాటు చేసుకున్నా సరే, చిత్తూరు వెళ్లి వస్తామన్నా సరేనన్నారు. వేడుకల ఏర్పాట్లకు తప్పక హాజరుకావాలన్నారు. జిల్లా సమీక్షలు ఇక్కడే నిర్వహిస్తామన్నారు. రాజధానిలో సమీక్షలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అత్యవసరం కాని పనులకు సంబంధించి తప్పక ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అప్పటికప్పుడు హడావుడి చేస్తామంటే కుదరదన్నారు. ఆయా శాఖల అధికారులు తమ హెచ్‌వోడీలను సంప్రదించి వేడుకలకు హాజరయ్యే వారి వివరాల జాబితాను ఉపపాలనాధికారి నిశాంత్‌కుమార్‌కు అందజేయాలని సూచించారు. ఇష్టానుసారం జాబితాలు ఇస్తే సహించేది లేదన్నారు. గదుల కొరత ఎక్కువగా ఉన్న కారణంగా స్పష్టమైన జాబితా ఇవ్వాలన్నారు. ఆగస్టు 15వ తేదీకి ముందు ప్రభుత్వ సెలవులు ఉన్నందున వసతి ఏర్పాట్లు ముందస్తుగానే చేసుకోవాలన్నారు. విమానాశ్రయం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌ల లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేడియంలో ఆరువేల మందికి మాత్రమే నేరుగా వీక్షించే అవకాశం ఉందన్నారు. కావున తిరుపతిలోని ప్రముఖ కూడళ్లు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేడియంలో జరిగే రిహార్సిల్స్‌ను నగర ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల విధులు నిర్వహించే అధికారులు డ్యూటీ పాసులను తిరుపతి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పొందాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా విధులు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా డ్యూటీ పాసు, ఐడి కార్డు ఉండాలని తెలియజేశారు. వీఐపీ, వివిఐపీలకు ఈద్గామైదానంలో, సాధారణ పార్కింగ్ ఎస్వీయూ క్యాంపస్ స్కూలు, ఎస్వీయూ ఆవరణలో ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. గ్యాలరీలలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నగర సుందరీకరణ, స్టేడియం వద్ద మరుగుదొడ్ల ఏర్పాటు బాధ్యతలు నగరపాలక అధికారులు చూడాలన్నారు. వీఐపీలు ప్రయాణించే రహదారులు అందంగా రూపొందించాలన్నారు. ప్రముఖులకు వాహనాల కేటాయింపు బాధ్యతలు రవాణాశాఖ చేపట్టాలన్నారు. 12 శకటాలు స్టేడియంలో ప్రదర్శన పూర్తయిన తరువాత నగర వీధుల్లో ప్రజలకు కనులవిందు చేసేందుకు అవసరమైన రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా సంయుక్త పాలనాధికారి గిరీషా, నగరపాలక సంస్థ కమిషనర్ హరికిరణ్, తిరుపతి ఉపపాలనాధికారి నిశాంత్‌కుమార్, జేసీ-2 చంద్రమౌళి, డీఆర్వో రజియాబేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడిన జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న

బిందు.. ఆ పల్లె బంధు..!



వర్షించే మేఘం అలకబూనింది..భూ'గర్భం'లోని జలం అందనంత దూరంలోకి వెళ్లిపోయింది..కాయకష్టం చేసే హలధారి కలవరపడ్డాడు.. కరవు నేలను చూసి.. హృదయం ద్రవించింది..కన్నీరు కార్చే సమయంలో కళ్లలో ఓ మెరుపు మెరిసింది.. కన్నీటి'బిందు'..కనువిప్పు కల్గించింది..ఇంకేం కార్యాచరణకు నడుంబిగించాడు.. బిందువునే..బంధువుగా భావించాడు..లభించే నీటిబొట్టును ఒడిసిపట్టాడు.. సర్కారు సాయాన్ని అందుకున్నాడు.. సంప్రదాయ సాగును విడిచిపెట్టాడు..ఆధునిక పద్ధతులకు శ్రీకారం చుట్టాడు..తక్కువ నీటితో..ఎక్కువ సాగుచేస్తూ. .లాభాల సిరిని అందుకున్నాడు..ఆలోచించి సాగు చేస్తే.. నష్టాలు కాదు..లాభాలు వస్తాయని సాటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

గ్రామంలో వందశాతం బిందుసేద్యం అమలు

చక్కటి దిగుబడులతో.. రైతుల్లో ఆనందం

ఉత్తమ ఉద్యాన అన్నదాతలుగా అవార్డులు కైవసం

ఎం.కొత్తూరు(రామసముద్రం), న్యూస్‌టుడే: కరవు సీమలో చాలీచాలని భూగర్భజలాలే శరణ్యం. ఉన్న నీటి బొట్టును కూడా వృథా చేయకుండా బిందుసేద్యంతో ముందుకు నడుస్తున్నారు మూగవాడి కొత్తూరు గ్రామ రైతులు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం, రాత్రిపూట విద్యుత్తు సరఫరాతో ఇబ్బంది లేకుండా సాగుకు నీటిని అందిస్తున్నారు. పైగా బిందు సేద్యం విధానంతో ఎరువులను మొక్క వేర్లకు నేరుగా అందించడం, క్రిమిసంహారక మందును బిందు పరికరాలతో అందించి సాగు వ్యయాన్ని తగ్గించుకుంటున్నారు. పంటసాగులో దుక్కి నేల అంతా తడవకుండా కేవలం మొక్కకే నీరు అందిస్తున్నారు. కలుపు నివారణ చేస్తున్నారు. పంట వ్యయాన్ని తగ్గిస్తున్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలో ఉద్యానవన పంటల సాగులో ఉత్తమ రైతులుగా అవార్డులు సైతం సొంతం చేసుకుంటున్నారు.

రాయితీ పూర్తిగా సద్వినియోగం

రామసముద్రం మండలం మూగవాడి గ్రామపంచాయతీలో ఎం.కొత్తూరు ఉంది. గ్రామం పరిధిలో భూగర్భజలాల స్థాయి గణనీయంగా పడిపోయింది. 1200 అడుగుల లోతు బోర్లు తవ్వినా నీరు లభించే పరిస్థితి లేదు. దీంతో కొద్దిపాటిగా వ్యవసాయ బోర్లలో లభించే నీటిని వృథా చేయకుండా వ్యవసాయం చేసేందుకు రైతులు నడుం కట్టారు. ప్రతి రైతు బిందుసేద్యంపై దృష్టి సారించారు. ప్రభుత్వం బిందుసేద్యానికి ఇచ్చే 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. గ్రామంలోని రైతులంతా వందశాతం పంట సాగుకు బిందుసేద్య పరికరాలను అమర్చుకున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తూ.. చక్కటి దిగుబడులు సాధిస్తున్నారు.

నీరు పారించే పద్ధతిలో ఖర్చులు ఇలా..

సాధారణ సాగు విధానాన్ని పరిశీలిస్తే.. ఎకరానికి అవసరమైన టమోటా మొక్కలు 8000. మొక్కకి రోజుకి అవసరమైన నీరు రెండు లీటర్లు. కానీ వృథా అయ్యే నీరు 20 లీటర్లు. పంటకు ఎరువుల ఖర్చు రూ. 40 వేలు. కూలీ ఖర్చు రూ.20 వేలు. మందుల ఖర్చు రూ.40 వేలు. అయితే బిందు సేద్యంలో పరిస్థితి మరోలా ఉంటుంది. ఎకరానికి మొక్కలు 8000. రోజుకి మొక్కకు నీటి అవసరం రెండు లీటర్లు. ఈ విధానంలో 20 లీటర్ల నీటి వృథాను అరికట్టవచ్చు. ఎరువుల ఖర్చు రూ.20 వేలు. కూలీల ఖర్చు లేదు. మందుల ఖర్చు కేవలం రూ.20 వేలు మాత్రమే.

వాణిజ్య పంటలనే దృష్టి

గ్రామ రైతులు వాణిజ్య పంటలపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. కేవలం బొప్పాయి, అరటి, టమోటా, వంగ, క్యాలీఫ్లవర్, మల్బరీ, పాడిఆవుల పెంపకం, క్యాబేజీ వంటి పంటలనే సాగు చేస్తారు. జిల్లాలో తక్కువ పంటసాగు ఉన్న పంటలనే ఎన్నుకుంటున్నారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల సలహా మేరకే పంటలను సాగు చేస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తారు. తక్కువ శ్రమ, నీరు, ఎరువుల, సాగు ఖర్చును ఆదా చేసే పద్ధతుల్లో పంటలను సాగు చేసి మంచి పంట దిగుబడులను తీస్తున్నారు.



బిందు సేద్యంతో సాగుచేసిన బొప్పాయితోట



సాగు చేసిన టమోటా

బిందుసేద్యం శ్రేయస్కరం



బిందుసేద్యంతో ఎనిమిది ఎకరాల్లో బొప్పాయి, పది ఎకరాల్లో టమోటా సాగు చేశా. ప్రస్తుత పరిస్థితుల్లో బిందుసేద్యం చాలా ఉపయోగకరం. భూగర్భజలాలు అరకొరగా ఉండడంతో పంట సాగు కష్టం. బిందుసేద్యంతో నీరు నేరుగా మొక్కకు మాత్రమే బిందు రూపంలో అందుతుంది. నీటి వృథా ఉండదు. ఫర్టిలైజర్ ట్యాంక్ ద్వారా మొక్కకే ఎరువు అందుతుంది. సాగుచేసే దుక్కి వదులుగా ఉండడంతో పంట ఎదుగుదల బాగా ఉంటుంది. పంటకు చీడపీడలు వ్యాపించవు. కలుపు నివారణ ఉంటుంది. **- కేశవరెడ్డి, ఉత్తమ ఉద్యాన రైతు, మదనపల్లె డివిజన్.ఎం.కొత్తూరు.**

బిందుసేద్యంలో కొత్తూరు ఆదర్శం



బిందుసేద్యం అమలులో ఎం.కొత్తూరు ఆదర్శం. ఉద్యానపంటలకు ఆ గ్రామం పెట్టింది పేరుగా నిలుస్తోంది. బొప్పాయి, టమోటా, క్యాలీఫ్లవర్, మస్క్‌మిల్లన్, వంగ వంటి ఉద్యానపంటలకు నిలయంగా మారింది. ఆధునిక పద్ధతులతో రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. పంట ఉత్పత్తులను కూడా నేరుగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలకు మార్కెటింగ్ చేస్తూ లాభాలు పొందుతున్నారు. ఇతర రైతులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. గ్రామంలో ఎంతో మంది రైతులకు డివిజన్, మండల స్థాయి ఉత్తమ ఉద్యాన రైతులుగా అవార్డులు సైతం అందించాం. **- రత్నకుమార్, ఉద్యాన శాఖ అధికారి, మదనపల్లె**

దీర్ఘకాలిక పంటలతో లాభాలు



దీర్ఘకాలిక పంటలైన అరటి, బొప్పాయి, మల్బరీ వంటి పంటలకు బిందుసేద్యం ఏర్పాటు చేసుకున్నాం. చాలా ఉపయోగంగా ఉంది. పంట పెట్టుబడి వ్యయం తుగ్గుతుంది. దిగుబడి బాగా ఉంది. లాభాలు పొందవచ్చు.

- జయచంద్రారెడ్డి, మండల ఉత్తమ హార్టికల్చర్ రైతు, మూగవాడి కొత్తూరు గ్రామం.

శకటమా.. ప్రగతి రథమా..

ఏడుకొండల చెంత ఏడు పదుల పండుగకు తెరలేచింది.. మరో నాలుగురోజుల్లో నిర్వహించనున్న వేడుకలకు తిరుధామం చక్కగా ముస్తాబవుతోంది.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తొలిసారిగా చిత్తూరుజిల్లాలో.. అదీనూ సప్తగిరుల్లో కొలువైన శ్రీనివాసుడు నెలవైన తిరుపతి వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది.. శ్రీవారి ఆలయాన్ని సాక్షాత్కరింపజేసే ప్రత్యేక తితిదే శకటం.. నవ్యాంధ్ర పాలనకు ప్రతీకగా నిలిచే అమరావతి నిర్మాణ వైశిష్ట్యాన్ని వివరించే సీఆర్‌డీఏ ప్రగతి శకటం.. నూతన రాష్ట్రాన్ని జలసిరులతో సస్యశ్యామలం చేసే ప్రాజెక్టులను వివరించే రథం.. గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలని తెలియజేసే గ్రామీణాభివృద్ధి శకటం.. విద్య, వైద్యం, గృహనిర్మాణం.. ఇలా అన్నిరంగాల్లో ప్రస్తుత నవ్యాంధ్ర ప్రస్థానాన్ని అడుగడుగునా సగర్వంగా చాటిచెప్పేలా.. ప్రత్యేకించి తిరుక్షేత్రానికి తరలివచ్చే అతిరథమహారథులు వీక్షించేలా.. నభూతో నభవిష్యతి అన్నరీతిన ప్రత్యేక శకటాలు తిరుధామంలో అడుగిడేందుకు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి.. తద్వారా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాన అంబరాన్నంటేలా తిరువీధుల్లో ప్రత్యేకాకర్షణగా నిలవనున్నాయి.

తొలిసారి తిరువీధుల్లో

విహరించనున్న శకటాలు

నవ్యాంధ్ర ప్రగతిని కళ్లకు కట్టేలా

సన్నాహాల్లో అధికార యంత్రాంగం

ఈనాడు-తిరుపతి

తొలిసారిగా తిరువీధుల్లో..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మైదానాల్లో కనిపించే శకటాలు సామాన్య ప్రజలను సైతం అలరించేందుకు రాష్ట్ర చరిత్రలో తొలిసారి తిరువీధుల్లో విహరించనున్నాయి. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రత్యేక శకటాలను రూపొందిస్తారు. వాటిని కేవలం పరేడ్ మైదానంలో మాత్రమే సందర్శకులు వీక్షించే వీలుగా ప్రదర్శిస్తారు. ఈసారి వేడుకల్లో మాత్రం ఆయా శకటాలను జనబాహుళ్యంలోకి తీసుకురానున్నారు. ఈ మేరకు వీటిని తిరునగర వీధుల్లో విహరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తోంది. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సంయుక్త సహకారంతో ఆయా శకటాల పర్యటనకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. మొత్తంమీద రేపటి జెండా పండుగకు తిరువాసులు సహా తరలిరానున్న ప్రముఖులకు ఓ మధురానుభూతిని మిగిల్చేలా అధికార యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేస్తోంది.



ఇవీ శకటాలు..

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయా శాఖలకు చెందిన శకటాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటివరకు 12శాఖలకు చెందిన శకటాలను మాత్రమే ప్రదర్శనలో ఉంచాలని తలచినా.. తుదిగా మరో రెండు ఆ జాబితాలో వచ్చిచేరనున్నాయి. ఇవన్నీ వెరసి మొత్తం 14శకటాలు.. నవ్యాంధ్ర ప్రగతిని ప్రతిబింబించేలా రూపుదిద్దుకుంటున్నాయి. ఆపై తిరువీధుల్లో తొలిగా ప్రదర్శనకు సన్నద్ధమవుతున్నాయి.



తితిదే



శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల చెంత స్వాతంత్ర్య వేడుకలను నిర్వహిస్తుండటంతో ఈసారి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీనిలో శ్రీవారి ఆలయంతో బాటు.. భక్తుల కోసం చేపట్టిన పలు సంస్కరణలు, అమలవుతున్న వివిధ పథకాలను వివరిస్తూ సదరు శకటం రూపుదిద్దుకోనుంది. భక్తులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు..ఏవిధమైన మార్పులు తీసుకొచ్చారనేది అందులో ప్రస్ఫుటం కానుంది.

సీఆర్‌డీఏ:

Andhra Pradesh Capital Region Development Authority

రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ప్రపంచ స్థాయిలో ఒక అద్భుతమైన సౌకర్యాలతో నూతన రాజధాని అమరావతిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రముఖ కంపెనీలతో ఆయా కట్టడాల నమూనాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అక్కడ ఎలాంటి నిర్మాణాలు రానున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రగతి ముందుకు ఎలా సాగనుందనే అంశాలను ప్రతిబింబిస్తూ శకటాన్ని రూపొందిస్తున్నారు.

జలవనరుల శాఖ



ఒకవైపు కృష్ణాబేసిన్‌లో నీరు అంతంతమాత్రంగానే వస్తోంది. మరోవైపు గోదావరిలో మాత్రం లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. అటు గోదావరి, కృష్ణాలను అనుసంధానం చేస్తూ పట్టిసీమ ప్రాజెక్టును పూర్తిచేశారు. అదేవిధంగా పురుషోత్తంపట్నం పనులను చేపడుతున్నారు. వీటిపై ప్రత్యేకంగా రూపొందించే శకటంలో జిల్లాకు సంబంధించి హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టుల వివరాలూ ఉండనున్నాయి.

అటవీశాఖ



పర్యావరణానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ తరుణంలో అటవీ సంరక్షణలో భాగంగా ఆ శాఖ ఏం చేస్తోంది.. జంతువులను పరిరక్షించేందుకు తీసుకుంటున్న చర్యలను శకటం ద్వారా తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారు.

గ్రామీణాభివృద్ధిశాఖ:



గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు ఖర్చు చేస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ముందంజలో ఉన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శకటం ద్వారా ప్రస్ఫుటింపజేయనున్నారు.

సాంఘిక సంక్షేమ కార్పొరేషన్



రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు అనేక పథకాల ద్వారా భారీగా లబ్ధి చేకూరుస్తున్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో బాటు పరిశ్రమల స్థాపనకు నిధులను కేటాయిస్తున్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. వీటన్నింటినీ కలిపి ఒక శకటాన్ని రూపొందించి ప్రదర్శించనున్నారు.

వ్యవసాయ శాఖ

రైతులకు రుణమాఫీ దగ్గర నుంచి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గత ఏడాది వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించి పెద్దఎత్తున దిగుబడి సాధించారు. వేరుసెనగ పంటను కాపాడేందుకు జలఫిరంగులను తొలిసారి వినియోగించి సత్ఫలితాలు సాధించారు. ఈ అంశాలన్నింటిచీతో కలిపి శకటాన్ని రూపొందించనున్నారు.



పర్యాటక, సాంస్కృతిక శాఖ



రాష్ట్రానికి ఆదాయం.. పెట్టుబడులు పర్యాటకం ద్వారా వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ఒప్పందాలు చేసుకున్నారు. వీటికి సంబంధించిన అంశాలు.. తాజాగా టూరిజం హబ్‌లలో చేపట్టనున్న కార్యక్రమాలను ఇందులో పొందుపరచనున్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

రాష్ట్రాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ముందుగా నగరాలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని భావించింది. ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని వీధుల్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. చెత్తద్వారా విద్యుదుత్పత్తి తయారీకి సన్నాహాలు చేస్తున్నారు. ఆయా అంశాలతో చక్కటి శకటాన్ని ఏర్పాటు చేయనున్నారు.



విద్యాశాఖ

రాష్ట్రాన్ని విద్యా హబ్‌గా మారుస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి పలు సందర్భాల్లో ప్రకటించారు. ఇందులో భాగంగానే రాష్ట్రానికి పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు వచ్చాయి. తద్వారా విద్యను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారు. కొత్తగా వచ్చిన విద్యాసంస్థలకు సంబంధించిన వివరాలతో శకటం రహదారి పైకి రానుంది.



గృహ నిర్మాణం:



రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టారు, ఎన్నింటిని లబ్ధిదారులకు అందించారు. రానున్న రెండేళ్లలో ఎన్ని పూర్తి చేయనున్నారు అనే వివరాలతో శకటం రూపుదిద్దుకోనుంది.

వైద్యఆరోగ్యశాఖ

ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంతో బాటు అందరూ ఆరోగ్యంగా ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. దీంతో ఇప్పటికే పలు కార్యక్రమాలు మొదలయ్యాయి. ఎన్టీఆర్ ఆరోగ్య పథకం ద్వారా సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ అంశాలతో ఒక శకటాన్ని రూపొందించనున్నారు.



విశేష జీవితం

ముదిమి వయస్సులో సేవా కార్యక్రమాలు

మరింత విస్తరించేందుకు సన్నాహాలు



శ్రీసరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ఒక్కరి మదిలో మెదిలిన ఆలోచన ఎందరో పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచింది. రెవెన్యూ కార్యాలయంలో ఏఎస్ఓగా ఉద్యోగం నిర్వహించి 1994లో పదవీ విరమణ పొందాడు. అనంతరం ఆయన మహాభారతంలోని కొన్ని ఘట్టాలను కథలుగా రాసేవారు. దీన్ని ఓ దినపత్రికలో ప్రచురించారు. కరీంనగర్‌కు చెందిన ఓ పేద మహిళ తమ పిల్లల చదువుకు సాయం చేయాలని అభ్యర్థించింది. వారికి కొంత ఆర్థిక సాయం చేశారు. ఈ విధంగా అయితే తాను ఒక రిద్దరికి మాత్రమే సాయం చేయగలుగుతానని తలచి తన మిత్రులను కలిసి చర్చించుకున్నారు. మిత్రులు సాయం అందిస్తామని ముందుకు వచ్చారు. ఫలితంగా రూపుదిద్దుకున్నదే శ్రీ సరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం. 2004లో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది.

పుత్తూరు, న్యూస్‌టుడే: 2004 జనవరి 18న 9 మంది సభ్యులతో ప్రారంభమైన శ్రీ సరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం నేడు 100 మంది సభ్యులతో సేవా కార్యక్రమాలను చేపట్టింది. ఒక్కో సభ్యుడు రూ.116 సేకరించి ఓ పాఠశాలలోని పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు. గత 13 సంవత్సరాలుగా ఇప్పటి వరకు 59 ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2290 మందికి రూ.6,71,644లతో యూనిఫారం, పుస్తకాలు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ ఏడాది రూ.1.50లక్షలు విలువచేసే నోటు పుస్తకాలు పుత్తూరు పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, నగరి మండలాల పరిధిలోని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రోజు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సేవా సమాజం ఆధ్వర్యంలో భోజనవసతి కల్పిస్తున్నారు. పుత్తూరులోని ప్రత్యేక అవసరాలగల పిల్లలకు రూ.25 వేలతో క్రీడా వస్తువులను అందించారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ గ్రేడ్లు సాధించిన విద్యార్థులకు దాతల సాయంతో నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు సభ్యులు ప్రకటించారు.

సేవాభావంతో కార్యక్రమాలు



సేవాభావంతో తాను ముందుకు వచ్చాను. సమాజం ప్రారంభం రోజున తనను సంప్రదించారు. తను సేవలో భాగస్వామ్యం కావాలని ముందడుగు వేశా. స్వార్థం పెరిగిన రోజుల్లో సేవా కార్యక్రమాలకు సమయాన్ని కేటాయించడం, ఆర్థికంగా ముందుకు రావడం ఎంతో ఆనందం. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఉంది.

- బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు, తడుకుపేట పాఠశాల

అభినందనీయం



ముదిమి వయస్సులో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆలోచన రావడం అభినందనీయం. 100 మంది సభ్యులు చేరడం ఎంతో సంతోషం. మిత్రులు కలిసి అనుకున్నది సాధించారు. తద్వారా ఎందరో పేద విద్యార్థులకు సాయం అందుతోంది. వారు చేస్తున్న సాయానికి తాను సాయం అందించాలని సభ్యుడిగా చేరాను.

- తిరుమలరాజు, ఎంఈవో, పుత్తూరు

పది మందికి సాయం



మనకు ఉన్న దానిలో పదుగురికి సాయం చేయడం ఎంతో అవసరం. తద్వారా పుణ్యం, పురుషార్థం కలుగుతోంది. ఎందరో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు కొనివ్వలేని తల్లిదండ్రులు ఉన్నారు. వారిని ఆదుకోవడం సంతోషం. సేవా సమాజంలో మరింత మంది సభ్యులుగా చేరితే మరింతమందికి సాయం చేయవచ్చు.

- రవిశంకర్, ఎంఈవో, నారాయణవనం, సభ్యులు

మిత్రుల సాయంతో ప్రారంభం



బాల్య మిత్రులు శ్రీపతిశెట్టి, కృష్ణమరాజు, వినోద్‌బాబు శెట్టి సాయంతోనే ఈ కార్యక్రమాలను చేపడుతున్నాం. వారు సహకారం అందించకపోతే ఈ సేవా సమాజం ఏర్పడేదేకాదు. ఎందరో పేద విద్యార్థులకు మేలు జరిగింది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సేవా కార్యక్రమాలకు వయస్సు అడ్డుకాదు. ప్రతి ఒక్కరూ తనకు తోచిన సాయం చేయాలి. అప్పుడే పేద విద్యార్థులకు మేలు జరుగుతోంది.

- మాడా మునిరత్నం, ఎస్.ఎస్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు, పుత్తూరు



భోజన వసతి కల్పిస్తూ..

హాయ్ బుజ్జీ!!

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Puff = ఊదుట, ఉబ్బు
- కలహం = పోట్లాట

నవ్వుల జల్లులు!



శీను: అమ్మా! పక్కింటాంటీ ఏంటీ, కుర్చీ పట్టుకుని నీ వెనకే తిరుగుతోంది?
తల్లి: నేను కట్టుకున్నది ఆవిడ పట్టుచీరలే!

- తోట తిరుపతిరావు, విశాఖపట్నం



తల్లి: గోడను అలా భూతద్దం పెట్టి చూస్తున్నావేంటి?
బిట్టు: నువ్వే కదమ్మా గోడలకు చెవులుంటాయన్నావు. అందుకే వెతుకుతున్నా!

- మంగళపెల్లి కొమురయ్య, తొర్రూరు

చిలిపి ప్రశ్న

పరుగులు ఎక్కడ తీస్తారు?

- ఎం. నాగభూషణం, మహబూబ్‌నగర్

లంచ్‌బాక్స్‌లు చూడండి... తినడం కుదరదండి!

స్కూలుకు పుస్తకాలతో పాటు తప్పకుండా తీసుకుపోయేదేంటి? ఒక్క నిమిషం ఆలోచించైనా టిఫిన్ బాక్స్ అని చెప్పేస్తాం. ఎందుకంటే అది కూడా మనం బడికి తీసుకుపోయే వాటిల్లో ముఖ్యమైంది. అందుకే ఇష్టమైన కార్టూన్‌పాత్రల బొమ్మలతో, రంగు రంగుల్లో మనకు నచ్చిన ఆకారాల్లో ఉన్న డబ్బాలను కొనుక్కుంటాం. సరేగానీ ఇదంతా ఇప్పుడెందుకు అనే సందేహం వచ్చిందా?

- రకరకాల భోజన డబ్బాలతో ఉందో ప్రదర్శనశాల. పేరు 'లంచ్‌బాక్స్ మ్యూజియం'. అతి పెద్దది కూడా. చూడాలంటే అమెరికా జార్జియాలోని కొలంబస్‌కు వెళ్లాల్సిందే.
- ఇందులో అడుగుపెట్టగానే ఒకటి కాదు రెండు కాదు వరుసల్లో పేర్చిన బోలెడు డబ్బాలు కనిపిస్తాయి. వీటి సంఖ్య దాదాపు 3,500. ప్లాస్టిక్, మెటల్ వంటి రకరకాల పదార్థాలతో చేసినవి ఇవన్నీ.
- అలెన్ ఉడాల్ అనే తాతయ్య సేకరించి పెట్టారీ డబ్బాలన్నింటినీ. 1990 నుంచి ఈ పని మొదలుపెట్టాడట. అలా ఆనాటి డబ్బాల నుంచి అంటే మన నాన్నలు బడికి తీసుకెళ్లిన వాటి నుంచి ఇప్పటి కొత్తరకం లంచ్‌బాక్స్‌ల వరకూ చూడొచ్చు.



మీకు తెలుసా?

- పనిచేసే దగ్గరకు డబ్బాలో భోజనం తీసుకెళ్లే పద్ధతి 200 సంవత్సరాల క్రితమే మొదలైంది.
- 1950 నుంచి 1970ల్లో టిఫిన్ - లంచ్ బాక్స్‌ల అలవాటు ఎక్కువగా పెరిగిందట. రకరకాల అలంకరణలతో మార్కెట్లోకి వచ్చాయట.

> నీకో లక్ష్యం ఉండటమే కాదు, దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునేలా వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి
>
> *- అబ్దుల్ కలాం*

ఎటు చదివినా ఒకటే!

BUSH SAW SUNUNU SWASH SUB.

ఐదు తేడాలు కనుక్కోండి





పట్టికలో పదాలు

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

Z	B	W	K	X	B	R	V	P	L	A	E	V	O	Z
J	P	R	A	J	V	U	O	E	Y	D	R	T	Q	T
P	C	A	L	E	C	N	A	D	U	O	U	B	G	Q
R	I	W	R	A	U	I	F	F	V	X	T	O	K	T
O	S	S	F	T	W	V	G	C	E	D	U	I	R	H
G	U	Q	D	Y	Y	E	A	D	K	A	F	K	E	P
R	M	A	C	N	G	R	O	C	O	L	L	E	G	E
A	L	Z	A	O	E	S	D	A	N	G	S	C	W	A
M	O	Y	R	W	S	I	O	Z	W	T	U	T	S	K
M	O	Q	D	K	N	T	R	B	O	N	C	X	Y	D
X	H	P	S	N	E	Y	H	F	G	R	C	E	S	F
W	C	H	E	N	O	I	T	A	R	B	E	L	E	C
N	S	R	K	V	A	S	G	I	F	T	S	C	U	A
A	B	I	B	G	D	X	C	W	W	R	S	P	K	P
W	A	W	A	R	D	S	S	P	E	C	I	A	L	E

SUCCESS, FUTURE, PROUD, PARTY, GIFT, DINNER, DANCE, GOWN, MUSIC, FRIENDS, CARDS, CELEBRATION, SPECIAL, COLLEGE

సరదా వాక్యాలు

కింది ఖాళీల్లో సరైన శరీర భాగాల పేర్లు రాస్తే వాక్యాలు అర్థవంతం అవుతాయి.

1. ___ ___ ప్రాణం తోకకు వచ్చింది.
2. ___ ___ ___ వాసిలో ప్రమాదం తప్పింది.
3. ___ ___ మంచిదైతే ఊరు మంచిదవుతుంది.
4. ___ ___ ___ చించుకుంటే కాళ్లమీద పడినట్లు
5. ___ ___ బంధం ఎంతో గొప్పది
6. ___ ___ ___ ___ లో వైకుంఠం చూపించినట్టు
7. ___ ___ ___ కాలాక ఆకులుపట్టుకున్నా లాభం లేదు

- ఆర్. టీనా శ్రీభవిష్య, విజయనగరం

మంచు గడ్డలు మునగవెందుకు?

ఎందుకు? ఏమిటి? ఎలా?

ప్రశ్న: మంచు గడ్డలు నీటిలో ఎందుకు మునగవు?

- బి. రాజేశ్వర్, పొన్కల్

జవాబు: ఏయే ద్రవాల్లో ఏయే పదార్థాలు మునుగుతాయో లేదా తేలుతాయో తెలిపే ప్లవన సూత్రాలు పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయి. ఒక ద్రవపు సాంద్రత కన్నా అందులో పడిన వస్తువు సాంద్రత తక్కువైతే ఆ పదార్థం తేలుతుందని ఎక్కువైతే మునుగుతుందని, సమానమైతే మునగకుండా తేలకుండా మధ్యలో వేలాడుతుందని ఆ సూత్రాలు తెలుపుతాయి. నీటి సాంద్రతకన్నా మంచు గడ్డ సాంద్రత తక్కువ. అందువల్లే మంచు గడ్డలు నీటిపై తేలుతున్నాయి. ప్రకృతిరీత్యా ఈ ధర్మం ఉండటం వల్లే చాలా తక్కువ ఉష్ణోగ్రత ఉన్న ధ్రువ ప్రాంతాలు, చలి ప్రాంతాల్లో ఉన్న సముద్రపు నీటిపై మంచుగడ్డలు ఉన్నా, కింద ఉన్న నీరు ద్రవరూపంలో ఉండటం వల్ల జలచరాలు బతుకుతున్నాయి. మరో తమాషా ఏంటంటే పైన మంచు గడ్డల బరువు వల్ల కిందున్న నీరు గడ్డకట్టే లక్షణం ఇంకా తగ్గిపోయి ద్రవ రూపంలోనే ఉంటుంది.



- ప్రొ॥ ఎ.రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

ఒక్కటి చాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Mother ___ త
2. Lid ___ త
3. Donor ___ త
4. Swim ___ త
5. Grandfather ___ త
6. Crab ___ త
7. Pair ___ త

జవాబులు: **చిలిపిప్రశ్న:** నేలపైన! **సరదా వాక్యాలు :** 1. తల 2. వెంట్రుక 3. నోరు 4. కడుపు 5. పేగు 6. అరచేతి 7. చేతులు **ఒక్కటి చాలు:** 1. మాత 2. మూత 3. దాత 4. ఈత 5. తాత 6. పీత 7. జత **ఐదు తేడాలు కనుక్కోండి:** ఎలుగు తోక, నోరు, పెంగ్విన్ కాలు, రెక్క, గొడుగు

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net

పచ్చిరొట్ట పైర్ల సాగు బహుళ ప్రయోజనం

✷ మామిడితోటల్లో సాగు మంచి ఫలసాయం ✷ అందుబాటులో విత్తనాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని సాగు భూముల్లో సేంద్రీయ పదార్థం తక్కువగా ఉన్నట్లు భూసార పరీక్ష ఫలితాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సేంద్రీయ పదార్థాలు తక్కువగా ఉండటం, భూమి భౌతిక, రసాయనిక స్థితుల్లో మార్పులు వచ్చి.. వేసిన ఎరువులు, భూమిలో ఉన్న పోషకాలు సక్రమంగా మొక్కకు లభించక పోషకాల లోపం కారణంగా పంట ఉత్పత్తులు తగ్గుతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మామిడి విస్తారంగా ఉంది. ఈ తోటల్లో పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి సారవంతమై నాణ్యమైన దిగుబడులు రానున్నాయి. పచ్చిరొట్టపైర్లు సాగు చేసిన మామిడి తోటల్లో నాణ్యమైన అధిక ఫలసాయం లభించి రైతులు అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది.

✷ జిల్లాలో సుమారు 83వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఈ ఉత్పత్తిలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉండటం..ఎక్కువమంది రైతులకు మామిడే ప్రధాన ఆర్థిక వనరుగా మారింది. రైతులు ఆయా చెట్లను ఎంతో జాగ్రత్తగా చేపట్టి చక్కటి ఫలసాయం పొందుతున్నారు. అయితే విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడకం, మందుల పిచికారి కారణంగా పంట ఉత్పత్తులు తగ్గిపోవడం, భూమి సారవంతం కోల్పోతోంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో భూమి నిస్సారమై దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి ఆహార భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ఈ తరుణంలోనే మామిడి తోటల్లో పచ్చిరొట్ట పైర్ల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి విస్తారంగా సాగు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



మామిడి తోటల్లో పచ్చిరొట్ట పైరు జనుము సాగు

తక్కువ ఖర్చు.. అధిక ప్రయోజనం

మామిడి తోటల్లో పచ్చిరొట్ట ఎరువుల పైర్ల సాగుతో తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం చేకూరుతుంది. తద్వారా సేంద్రియ కర్బనం భూమికి అందుతుంది. భూమికి ఎక్కువగా నీరు పీల్చుకునే శక్తి పెరిగి.. తేమ ఎక్కువ కాలం అందులో ఉండేలా చూస్తుంది. గాలిలో నత్రజనిని పీల్చుకుని మొక్కల వేళ్లల్లో దాచిపెడుతుంది. కలుపు మొక్కలు పెరిగి భూమిలో సారాన్ని పీల్చివేయకుండా కలుపును అదుపులో ఉంచుతుంది. భూమి(గాలి ప్రసరణ పెరుగుతుంది) కుళ్లబారుతుంది. సమస్యాత్మక భూమి ఉంటే దాని తీవ్రత తగ్గుతుంది. భూమి ఆరోగ్యం మెరుగుపడి మామిడి మొక్కలు మెరుగుబడి సుమారు 25-30 శాతం అధికంగా దిగుబడులకు దోహదపడుతుంది. పడిన వర్షపు నీరు బయటకు పోకుండా ఇంకిపోవ డానికి ఉపయుక్తంగా మారుతుంది.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పచ్చిరొట్ట పైర్లు జీలుగ, జనుము విత్తనాలు 75శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో దాదాపు మామిడి కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మామిడి తోటల్లో పచ్చిరొట్ట పైర్ల సాగుకు అనుకూలంగా ఉంది. ఎకరా విస్తీర్ణానికి సుమారు 18కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తిన 40రోజులకు పువ్వు రాగానే దున్నివేయాలి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో సుమారు 15-20టన్నుల పశువుల ఎరువు అందించే ఫలాన్ని పొందవచ్చు. ప్రస్తుతం జిల్లాలో జనుము 400క్వింటాళ్లు, జీలుగ 150క్వింటాళ్లు, పిల్లిపెసర విత్తనాలు 50క్వింటాళ్లు నిల్వ ఉంది. విత్తనాలకు కొరత లేదని, అవసరమైన మేరకు సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్ తెలిపారు.

నేడు నిరుద్యోగులకు ఎస్వీయూలో ఎంపిక ముఖాముఖి

తిరుపతి.(భవానీనగర్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మోడల్ కేరీర్ సెంటర్ ద్వారా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆవరణలో శుక్రవారం జిల్లాలో ఖాళీగా ఉన్న 25 ఉద్యోగాల కోసం శుక్రవారం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆర్.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, నెల్లూరు ప్రాంతాలలో ఉన్న ఈ ఖాళీలకు ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో 20నుంచి 28 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగులకు అవకాశం కల్పించనున్నామన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9966843255, 7997008877 చరవాణి నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చెక్‌డ్యామ్ పనులకు టెండర్లు

జిల్లా పాలనాధికారికి ప్రతిపాదనలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే : నీరు-ప్రగతి పనుల్లో జన్మభూమి కమిటీల ఆగడాలకు జిల్లా యంత్రాంగం అడ్డుకట్ట వేయనుంది. పనుల అప్పగింతలో జన్మభూమి కమిటీల పెత్తనం, పనులు ఆలస్యం తదితర ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కత్తెర్లు వేసేందుకు చర్యలు చేపట్టారు. నీరు-ప్రగతి పథకం కింద మంజూరై జన్మభూమి కమిటీ ఆమోదముద్ర పడని పనులకు ప్రత్యామ్నాయంగా గ్రూపు టెండర్ల ప్రక్రియ ద్వారా గుత్తేదారులకు పనులు అప్పగించే దిశగా జిల్లా జలవనరుల శాఖ అధికారులు కసరత్తులు ముమ్మరం చేశారు. టెండర్ ప్రక్రియ నిర్వహణకు జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న ఆమోదం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదించారు. నీరు-ప్రగతి పథకంలో జిల్లాలో పెద్దఎత్తున చెరువు కట్టలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు సంబంధించి రూ.580 కోట్ల వ్యయ అంచనాలతో 5,420 పనులు మంజూరు చేశారు. నిధుల కేటాయింపులో చెక్‌డ్యామ్ నిర్మాణాల పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. రూ.10 లక్షల లోపు వ్యయ అంచనాలతో చేపట్టే పనులను జన్మభూమి కమిటీల ఆమోదంతో నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారు. రూ.10 లక్షలకు పైబడి వ్యయ అంచనాలతో చేస్తున్న పనులను టెండర్ల ప్రకియ ద్వారా గుత్తేదారులకు అప్పగించడం ప్రస్తుతం జరుగుతున్న విధానం. అయితే గ్రామ, మండల స్థాయిలో అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం తదితర కారణాలతో జన్మభూమి కమిటీల ఆమోదముద్రలేక ధ్రువీకరణ పత్రాలు జలవనరుల శాఖ కార్యాలయానికి చేరడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 చెక్‌డ్యామ్ పనులు జన్మభూమి కమిటీ ఆమోదం లేక ఆగిపోయాయి. జన్మభూమి కమిటీల ఆమోదముద్ర ఆలస్యంతో పనులు పురోగతి ఆశించిన స్థాయిలో వేగవంతం కావడం లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా పాలనాధికారి గుర్తించారు. ఆమోదం పొందని పనులను టెండర్ల ప్రక్రియ ద్వారా నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. దీనిపై జల వనరుల శాఖ అధికారులు మండలాల వారీగా పనుల వివరాలను నివేదిక రూపంలో పాలనాధికారికి నివేదించారు. పాలనాధికారి ఆమోదముద్ర రాగానే గ్రూపు టెండర్ల ప్రక్రియ ద్వారా గుత్తేదారులకు చెక్‌డ్యామ్ పనులను అప్పగించనున్నామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

అప్రమత్తత అవశ్యం

☛ నిఘావర్గాల సూచనలతో భద్రత పెంపు

☛ భద్రతా ఉద్యోగులకు ఈవో సూచన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంతో పాటు ఆలయాలనికి వచ్చే భక్తులకు పటిష్టమైన భద్రత కల్పించాల్సిన బాధ్యత భద్రతా ఉద్యోగులపై ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధులై అప్రమత్తతతో విధులు నిర్వహించాలంటూ ఈవో భ్రమరాంబ సూచించారు. ఆలయ పరిపాలన భవనంలోని సమావేశపు హాలులో గురువారం ఆలయ సెక్యూరిటీలు, హోంగార్డులు, ఎస్పీఎఫ్ బృందాలతో ఆమె సమావేశం అయ్యారు. పంద్రాగస్టు రోజున ఆలయాల వద్ద పగడ్బందీ బందోబస్తు కల్పించాలంటూ నిఘా వర్గాల నుంచి సూచనలు వచ్చాయన్నారు. ఆ ప్రకారం ఇప్పటి నుంచే.. భద్రతా ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ముక్కంటి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, దళారుల నియంత్రణకు కోసం మీకు బాధ్యతలు అప్పగిస్తే.. మీరే దళారులుగా మారితే మాత్రం సహించబోమని స్పష్టం చేశారు.



ఆలయ భద్రతా సిబ్బందితో సమావేశమైన ఈవో భ్రమరాంబ, ఈఈ వెంకటనారాయణ

స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో అడ్డదారి దర్శనాలు నిలువరించాలని సూచనలు ఇచ్చారు. మీ పనితీరును నిఘా కెమెరాల్లో చూస్తుంటానని, ఎవరైనా తప్పులు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అలాగే తాను ఇక్కడ ఈవోగా ఉన్నన్ని రోజులు అందరూ నిబద్ధతతో పనిచేయాలని, ఆలయానికి ప్రతిష్ట తీసుకురావాలంటూ సూచనలు చేశారు. విధుల పరంగా వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆలయ ఈఈ వెంకటనారాయణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో పచ్చని పంటలు

రైతులు తాము సాగు చేస్తున్న పైర్లలో విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగంతో భూములు సారం కోల్పోతున్నాయి. పంట దిగుబడులు తగ్గి రైతు ఆర్థికంగా నష్టపోతున్నాడు. ఈ తరుణంలో భూసారం పెంచాలంటే రైతులు సేంద్రియ ఎరువుల సాగుపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వం కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టింది. రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, వానపాముల ఎరువు తయారీ యూనిట్లు తదితరాలు రైతులకు అందుబాటులో ఉంచింది.

★ తక్కువ ఖర్చుతో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పచ్చని పైర్లు పెంచవచ్చు. ఖరీఫ్ సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్ల సాగు చేపట్టి, ఆ తరువాత ముఖ్య పంటలు సాగు చేస్తే.. నాణ్యమైన దిగుబడులు రాబట్టుకోవడంతో పాటు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి రైతుకు పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయి. భూసారం పెరిగి తద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండి, ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ పచ్చిరొట్ట సాగుపై రైతుల్లో అవగాహన కల్పించే చర్యలు చేపట్టింది. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ 12 కిలోలు, కట్టె జనుము 16 కిలోలు ఒక ఎకరాకు వేయాలని వ్యవసాయాధికార్లు సూచిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయశాఖ పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై రైతులకు అందించింది.



కట్టె జనుము పైరు

★ వెదజల్లే విధానంలో పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టేందుకు అవకాశం లేదు. కేవలం దమ్ము చేసి నాట్లు వేసే పొలంలో మాత్రమే పచ్చిరొట్ట సాగు చేపట్టాలి. తొలకరి వర్షాల ప్రారంభంలో పొలాన్ని దున్ని పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి. ఊడ్పులకు ముందుగా ఏపుగా పెరిగిన పచ్చిరొట్ట మొక్కలను దమ్ముచేసి, వారం పాటు బాగా కుళ్లనిచ్చి ఆ తరువాత నాట్లు వేసుకుంటే పైర్లు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. పచ్చిరొట్ట సాగుచేసిన పొలాల్లో చీడపీడల తాకిడి తక్కువగా ఉండి, పైర్లు ఆరోగ్యవంతగా పెరిగి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ సూచిస్తోంది.

'75 శాతం రాయితీపై జీలుగ, కట్టె జనుము విత్తనాలను రైతులకు అందించాం. చాలా మంది రైతులు ఆసక్తి కనబరిచి పచ్చిరొట్ట సాగు చేపట్టారు. పచ్చిరొట్ట పైర్లను పూత దశలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పైర్లకు అవసరమైన సూక్ష్మపోషకాల లభ్యత పెరిగి, నాణ్యమైన దిగుబడులు రాబట్టుకోవచ్చు. సాధారణం కంటే పచ్చిరొట్ట సాగుచేసిన పైర్లలో పంట దిగుబడులు అధికంగా ఉంటాయ'ని వ్యవసాయాధికారి వి.శ్రీనివాసరావు చెప్పారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

చెరకులో లద్దె పురుగుల నివారణ

చెరకు సాగులో లద్దె పురుగు వల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ పురుగు నివారణకు ముందుగానే చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని పశ్చిమగోదావరి జిల్లా టి.నరసాపురం మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు.



లద్దె పురుగులు ఆశించడంతో ఎండుతున్న చెరకు పంట

చెరకు సాగులో తేమ వల్ల లద్దెపురుగు ఆశిస్తుంది. తేమ తక్కువైన సమయంలో మొక్క మొదలుకు వెళ్లి అక్కడ చెరకు వేర్లను తిని బతుకుతుంది. అక్కడే గుడ్లు పెట్టి సంతతిని పెంచటం వల్ల మొత్తం చెరకు పొలం ఎండిపోతుంది. ఈ పురుగు నివారణకు.. ముందుగా దుక్కిలో ఫోరేట్ గుళికలు 8 కిలోలు వేసి నీరు పెట్టాలి లేదా నాటిన నెలరోజుల్లోపు సాళ్ల మధ్య గుళికలు వేసి నీరు పెట్టడం వల్ల లద్దె పురుగు ఆశించదు. పైరు పెరిగాక లద్దె పురుగు బెడద ఉంటే చేలో బాగా నీరు నిల్వ ఉండేలా చేసి అందులో ఎకరాకు మూడు లీటర్ల ఇంజిన్‌లో వాడిన ఆయిల్(మడ్డి ఆయిల్)ను ఎకరాకు మూడు లీటర్లు చల్లటం వల్ల పురుగు చనిపోతుంది.

– న్యూస్‌టుడే, టి.నరసాపురం (ప.గో.జిల్లా)

పంచాయతీ లెక్క.. ఇక పక్కా!

❖ ప్రియా సాఫ్ట్‌వేర్‌లో పూర్తి వివరాలు ❖ ఎక్కడి నుంచైనా అంతర్జాలంలో తెలుసుకునే అవకాశం ❖ త్వరలో ప్రక్రియ ప్రారంభం

గ్రామ పంచాయతీ లెక్కలు ఇక పక్కాగా నమోదు కానున్నాయి. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ఏ పంచాయతీ వివరాలైనా అంతర్జాలం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అవినీతికి చెక్ పెడుతూ, ప్రతి పైసా ఖర్చును ఆన్‌లైన్లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ప్రియా సాఫ్ట్ వేర్‌ను ఇది వరకే ప్రవేశపెట్టారు. మూడేళ్ల కిందటే ఇది అందుబాటులోకి వచ్చినా అమల్లో అనేక అడ్డంకులు ఎదురై తీవ్ర జాప్యం జరిగింది. మళ్లీ ఈ ప్రక్రియను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆన్‌లైన్లో పల్లె పాలనా వివరాలను నమోదు చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ)

గ్రామాల ప్రగతితోనే దేశాభివృద్ధిని లెక్కిస్తారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పల్లె పాలకుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు తాగు నీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, ఇతర మౌలిక వసతులు కల్పించాలి. ఆస్తి పన్ను పంచాయతీలకు ప్రధాన ఆర్థిక వనరుగా ఉంది. నిర్మాణాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం రూపంలో నిధులు మంజూరు చేస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా పారిశుద్ధ్య నిధులు ఇస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి, విధిగా గ్రామ పాలకులు సమావేశమై ప్రజలకు అవసరమైన సేవలు గుర్తించాలి. అందుకు అయ్యే ఖర్చును అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామసభల్లో చేసే తీర్మానాల ద్వారా పనులు చేసే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. స్థానిక పాలకులు విధిగా ఏడాదికి కనీసం రెండు సార్లు గ్రామసభలు నిర్వహించి చేపట్టిన పనులు, ఖర్చులను తెలపాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి కొనసాగుతున్న విధానం ఇది. అనేక పంచాయతీల్లో పాలకులు నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలోనే జిల్లాలో 21 గ్రామ పంచాయతీల్లో నిధుల వినియోగంపై ఆంక్షలు విధించారు. పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు పేరుతో నిధులు కాజేస్తున్నారు. గడిచిన పదేళ్ల కాలంలో జిల్లాలోని పంచాయతీల్లో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్ అధికారులు లెక్క తేల్చారు. అభివృద్ధిని కాగితాల్లో చూపుతున్నా, క్షేత్ర స్థాయిలో వాస్తవాలు అందుకు తగ్గట్లు లేవు. గ్రామాభివృద్ధి కమిటీలను తమ కనుసన్నల్లో ఉంచుకుని స్థానిక పాలకులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ తరుణంలో ప్రియా సాఫ్ట్‌వేర్ ద్వారా ఇలాంటి అక్రమాలకు కళ్లెం వేయనున్నారు.



పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

రాజీవ్ ఇంటర్నెట్ పంచాయతీలను 15 ఏళ్ల కిందటే ప్రవేశపెట్టారు. ఇవి ఎంపిక చేసిన పెద్ద(నోటిఫైడ్) పంచాయతీలకే పరిమితమయ్యాయి. గ్రామ పాలకులపై అవినీతి ఆరోపణలు పెరగడం, పల్లె ప్రజలు మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పారదర్శకతకు పెద్ద పీట వేయడానికి మూడేళ్ల కిందట అన్ని పంచాయతీలకు ప్రియా సాఫ్ట్ వేర్‌ను అందించారు. కంప్యూటర్‌తో పాటు కార్యదర్శులు నమోదు చేయాల్సిన వివరాలపై శిక్షణ ఇచ్చారు. అంతటితో సరి. ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. పంచాయతీ కార్యదర్శులతో సహా, సర్పంచులు ప్రియా సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదు చేయాలన్న విషయాన్నే మరిచిపోయారు. ప్రస్తుతం అంతర్జాలంలో వివరాల నమోదు తప్పని సరి చేయడంతో అందుకు సంబంధించి ప్రక్రియను ప్రారంభించారు.

ఉపయోగాలు ఇవీ

జిల్లాలో 1363 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో 35 మేజర్ గ్రామ పంచాయతీలున్నాయి. వీన్నింటి వివరాలు పారదర్శకంగా నమోదు కాబోతున్నాయి. ప్రభుత్వం ద్వారా మంజూరైన వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. వాటి ద్వారా చేసిన పనుల సమాచారాన్ని అంతర్జాలంలో పెట్టాలి. మురుగు కాలువల్లో పూడిక తీత, పారిశుద్ధ్య పనులు, ఇతర పనులు చేశామని ప్రస్తుతం లెక్క చూపుతున్నారు. ఇకపై ప్రియా సాఫ్ట్ వేర్‌లో ఎవరి ఇంటి నుంచి ఎవరి ఇంటి వరకూ కాలువలు శుభ్రం చేశారు, కొత్తగా కాలువలు నిర్మాణం, లేక ఎక్కడి నుంచి ఎక్కడకు సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు అన్న వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి. గ్రామాలను వీడి ఇతర ప్రాంతాల్లో పని చేసే వ్యక్తులు తమ గ్రామాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. అందులో నమోదు చేసిన వివరాలు నిజం కాని పక్షంలో వాటిపై ఫిర్యాదు చేయవచ్చు.

చర్యలు చేపట్టాం

పంచాయతీల్లో పారదర్శక పాలనను అందించేందుకు చర్యలు చేపట్టాం. పంచాయతీల నిధులు, వ్యయం వివరాలను ప్రియా సాఫ్ట్‌వేర్ సాయంతో అంతర్జాలంలో నమోదు చేయాలని ఇది వరకే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని కారణాలతో ప్రక్రియ ఆలస్యమైంది. తిరిగి పంచాయతీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభిస్తున్నాం. కొన్ని మార్పులు చేర్పులతో త్వరలో పంచాయతీ సిబ్బందికి శిక్షణనిచ్చి ప్రక్రియను వేగవంతం చేస్తాం.

- కె.ఎల్.ప్రభాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి



దృశ్యమాధ్యమ సమావేశం ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న

కుప్పంలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న

చిత్తూరు (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా పాలనాధికారి క్యాంపు కార్యాలయం నుంచి కుప్పంలోని అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం ద్వారా సమీక్షించారు. కుప్పంలో ఇటీవల ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటన సందర్భంగా వచ్చిన వినతులు వంద శాతం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా వినతులను విచారణించి పరిష్కరించి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజా సమస్యలపై అధికారులు వేగంగా స్పందించాలన్నారు. రుణమాఫీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు చేరింది.. లేనిది గుర్తించి సరిచేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన పక్కాగృహాలను వందశాతం నిర్మాణాలు ప్రారంభింపజేయాలని తెలిపారు. గృహనిర్మాణాలకు సంబంధించి ఇంటి పట్టాలను వేగంగా పంపిణీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. శాఖలకు కేటాయించిన నోడల్ అధికారులు ఆయా శాఖల్లో ప్రభుత్వ కార్యక్రమాలు వేగంగా సాగేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో శిక్షణ కలెక్టరు కీర్తి, జలవనరుల శాఖ ఎస్సీ రామకృష్ణ, వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్‌రెడ్డి, డ్వామా పీడీ కుర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇగ్నో'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(బాలాజీకాలని), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో జూలై 2017 సెషన్‌కు గాను పీజీ, యూజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్ర సమన్వయ కర్త డాక్టర్ పోకల భాస్కరుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అధ్యయన కేంద్రంలో ప్రత్యేకించి యువతకు ఉపాధి, స్వయం ఉపాధి కలిగిన డిప్లొమా ఇన్ టూరిజం, స్టాటిస్టిక్స్, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫంక్షనల్ ఇంగ్లీషు, సీఏ విద్యార్థులకు బీకామ్(ఏ అండ్ ఎఫ్), బీపీపీ(ఏ విద్యార్హత లేకున్నా బీఏ లేదా బీ.కామ్ కోర్సులలో చేరడానికి సన్నాహపు కోర్సు) సైకాలజీ కోర్సు, అర్బన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్‌లలో పీజీ డిప్లొమా కోర్సులు ఉన్నాయని తెలిపారు. ప్రవేశాల కొరకు www.ignou.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18న ప్రవేశాలకు చివరితేదీ అని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 99631 44499, 78938 54776 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



రైతు రమణారెడ్డికి మంజూరు పత్రం అందచేస్తున్న చిరంజీవి చౌదరి

ఉద్యానపంటల్లో రాష్ట్రం ద్వితీయస్థానం

☛ రూ.వెయ్యి కోట్లు కేటాయింపు

☛ ఉద్యానశాఖ రాష్ట్ర కమిషనర్ చిరంజీవి చౌదరి

పీలేరు ఆర్ఎస్ మెయిన్, న్యూస్‌టుడే: ఉద్యానపంటలు, సూక్ష్మసేద్యంలో దేశంలో రాష్ట్రం ద్వితీయస్థానంలో ఉందని ఉద్యానశాఖ రాష్ట్ర కమిషనర్ చిరంజీవి చౌదరి అన్నారు. గురువారం స్థానిక సీఎల్ఆర్‌సీలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఫారం కుంటల నిర్మాణ విధివిధానాలపై అవగాహన సదస్సు జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ.. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 10ఎకరాలకుపైగా భూములున్న రైతులకు 90శాతం, అంతకు తక్కువ భూములున్న రైతులకు 70శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. గతేడాది రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల్లో ఉద్యానపంటలు సాగు చేశారన్నారు. ఈ ఏడాది రూ.వెయ్యి కోట్లతో ఉద్యానపంటలు సాగు చేయాలన్న లక్ష్యానికి గాను ఇప్పటి వరకు రూ.300 కోట్లు ఖర్చు చేశామన్నారు. సూక్ష్మ సేద్యంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని, భూగర్భజలాలు కూడ అరవైశాతం ఆదా అవుతాయన్నారు. రైతులకు అవసరమైన సలహాలు ఇచ్చేందుకు త్వరలో మండలాలకు అదనంగా ఎంపీఈవోలను నియమిస్తున్నామన్నారు. అనంతరం ఉద్యానశాఖలో 15మంది రైతులకు 15.20ఎకరాలకు సంబంధించి మంజూరైన రూ.2,67,505 రాయితీ పత్రాలను పంపిణీ చేశారు. ఉద్యానశాఖ ఉప సంచాలకురాలు సరస్వతి, సెరికల్చర్ సంయుక్త సంచాలకుడు దేవకుమార్, పీలేరు ఏడీఏ సుభాషిణి, ఏవో లక్ష్మీప్రసన్న కుమారి, ఉద్యానరైతులు పాల్గొన్నారు.

బదిలీ కౌన్సెలింగ్ వేగవంతం

నేడు భాషా పండితుల అప్‌గ్రెడేషన్ ప్రక్రియ

చిత్తూరు (విద్య), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ గురువారం సెకండరీగ్రేడు, వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించారు. అంతర్జాలం సమస్యతోపాటు ఉపాధ్యాయుల అభ్యంతరాల మధ్య తెల్లవారుజామున 3 గంటల వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. చిత్తూరులో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి షర్మన్ బాలికోన్నత పాఠశాలలో సెకండరీగ్రేడు ఉపాధ్యాయుల(ఎస్జీటీ)కు, సాయంత్రం 5 గంటలకు వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను చేపట్టారు. పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో డీఈవో శామ్యూల్ కౌన్సెలింగ్‌ను సజావుగా నిర్వహించారు. బదిలీలను త్వరితగతిన ముగించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. సాయంత్రం ఓ ఉపాధ్యాయురాలు శ్రీకాళహస్తి మండలంలో గతంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీలోనే మరో పాఠశాలను ఎంపిక చేశారు. అయితే ఒకే పంచాయతీలో మరో పర్యాయం కోరుకోవడానికి ప్రయత్నించగా అంతర్జాలం తెరపై చూపించలేదు. దీంతో కౌన్సెలింగ్ నిర్వహణాధికారులు, ఆ ఉపాధ్యాయురాలి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కాసేపు అంతరాయం ఏర్పడింది.

భాషా పండితుల అప్‌గ్రెడేషన్‌ను చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. అప్‌గ్రెడేషన్ ప్రక్రియలో ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులను పాఠశాల సహాయకులుగా నియమించనున్నామన్నారు. ఇందులో భాగంగా తెలుగు 57 మంది, హిందీ 25 మంది, ఉర్దూ, తమిళంలో నలుగురు చొప్పున పదోన్నతీకరణ పొందనున్నారని చెప్పారు.



వ్యాయామ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, పక్కన డీఈవో శామ్యూల్



హాజరైన ఉపాధ్యాయులు

ఎస్జీటీలు 3,700 వరకు కౌన్సెలింగ్

సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి నగరంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో కొనసాగుతుందని డీఈవో పేర్కొన్నారు. 2,701 నుంచి 3,700 వరకు బదిలీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 8 గంటలకు 3,050 వరకు, మధ్యాహ్నం ఒంటిగంటకు 3,400, సాయంత్రం 5 గంటలకు మిగిలిన ఉపాధ్యాయుల బదిలీ సీనియారిటీ సంఖ్య ప్రకారం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.